

కేజ్రీవాల్ జైలులో ఉంటూ ప్రభుత్వాన్ని నడిపారు
2లో..

నేటి ప్రభాత
# సూర్య
జాతీయ తెలుగు దిన పత్రిక
TGTEL/25/A0784

## రిపోర్టర్లు కావలెను
పత్రిక ప్రారంభించిన అనతికాలంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన నేటి ప్రభాత సూర్య తెలుగు దినపత్రికలో పనిచేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి రిపోర్టర్లు కావలెను.
అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం.
మరిన్ని వివరాలకు సంప్రదించగలరు.
9100900918
9100900931

ప్రచురణ : హైదరాబాద్ | ఎడిటర్ : పోలగోని రాజేశ్ | శనివారం | 23- 08- 2025 | సంపుటి : 1 | సంచిక : 81 | పేజీలు : 8 | వెల : 4/-



ఓట్ల తొలగింపులో
## రాజకీయ పార్టీల తీరుపై విస్మయం

- బూత్ స్థాయిలో ఓటర్లకు సాయం చేయాలని సుప్రీం సూచన
- ఓటు సవరణకు గడువు పెంచాలని ఈసీకి ఆదేశం

2లో..

బిహార్‌లో ఓటరు జాబితా సవరణ వివాదంపై సుప్రీం కోర్టు విచారణ కొనసాగింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మల్య బాగ్చి బెంచ్ విచారణ చేపట్టింది.



## వీధుల్లో పెట్టొద్దు!

- వీధికుక్కల బెడదపై సుప్రీం కీలక ఆదేశాలు
- బహిరంగ ప్రదేశాల్లో ఆహారం నిషేధం
- నిర్దేశిత స్థలాల్లోనే ఆహార ఏర్పాట్లు

3లో..

వీధికుక్కల బెడదకు సంబంధించి సుప్రీంకోర్టు శుక్రవారం కీలక ఆదేశాలు వెలువరించింది. వీధులు లేదా బహిరంగ ప్రదేశాల్లో ఆహారం అందించడం చట్ట విరుద్ధమని స్పష్టం చేసింది.

# హైకోర్టులో కెసిఆర్, హరీష్‌కు చుక్కెదురు







- పిసి ఘోష్ కమిషన్‌పై స్టేకు నిరాకరణ
- అసెంబ్లీలో చర్చించాకే ముందుకు వెళతాం
- హైకోర్టుకు వివరించిన తెలంగాణ ప్రభుత్వం
- విచారణ నాలుగు వారాలకు వాయిదా

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :**
మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావుకు హైకోర్టులో చుక్కెదురైంది. కాళేశ్వరం కమిషన్ రిపోర్టుపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి హైకోర్టు నిరాకరించింది.విచారణ నాలుగు వారాలకు వాయిదా వేసింది. పూర్తి స్థాయి కౌంటర్‌ను దాఖలు చేయాలని అడ్వకేట్ జనరల్‌ను హైకోర్టు ఆదేశించింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ రిపోర్టు అసెంబ్లీలో చర్చించిన తరువాతే తదుపరి చర్యలు ఉంటాయని ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. ప్రస్తుతం కేసీఆర్,హరీష్‌రావు ఎమ్మెల్యేలు కాబట్టి అసెంబ్లీలో చర్చించాకే చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పింది. ప్రభుత్వంపై కూడా హైకోర్టు సీరియస్ అయింది. ముందస్తుగా మీడియా సమావేశం నిర్వహించి.. 60 పేజీల రిపోర్ట్ బయట పెట్టడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. అన్ని పబ్లిక్

మిగతా 2వ పేజీలో..



3లో..

## 25న తెలంగాణ కేబినేట్ భేటీ

- బిసి రిజర్వేషన్లు, స్థానిక ఎన్నికలపై చర్చ
- కాళేశ్వరం నివేదికపైనా చర్చించే అవకాశం
- హైకోర్టు స్టేకు నిరాకరించడంతో కేబినెట్ భేటీ సర్వత్రా ఉత్కంఠ

# పార్లమెంట్‌లోకి ఆగంతకుడు



- భద్రతా సిబ్బంది కళ్లుగప్పి గోడ దూకిన ఆగంతకుడు
- వెంటనే సిబ్బంది అప్రమత్తం
- అదుపులోకి ఆగంతకుడు
- అన్ని కోణాల్లో చేపడుతున్న విచారణ
- అతడి వెనుక ఎవరైనా ఉన్నారా? అనే అంశంపై దర్యాప్తు
- మరోసారి భద్రతా వైఫల్యం బట్టబయలు

పార్లమెంట్‌లోని భద్రతా సిబ్బంది వైఫల్యం మరోసారి బహిర్గతమైంది. ఓ ఆగంతకుడు గోడ దూకి పార్లమెంట్ భవనంలోకి చొరబడ్డాడు. భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమై.. అతడిని అదుపులోకి తీసుకుంది. శుక్రవారం ఉదయం ఒక వ్యక్తి రైలు భవనం వైపున్న చెట్టు ఎక్కి.. కొత్త పార్లమెంట్ భవనంలోని గరుడ గేట్ వద్ద కిందకి దూకి పార్లమెంట్ భవనంలోకి ప్రవేశించాడు.

4లో..



# అవినీతిపై పోరాటం ఆగదు

- దీనిపై చట్టం తీసుకుని వస్తే వ్యతిరేకిస్తే ఎలా
- బీహార్ పర్యటనలో ప్రధాని మోడీ వెల్లడి



**పాట్నా- నేటి ప్రభాత సూర్య :**
అవినీతి వ్యతిరేక పోరాటం ఆగదని, దీనిని సమర్థించే నేతలకు ప్రజలే బుద్ధి చెబుతారని ప్రధాని మోడీ అన్నారు. 50 గంటలు జైలు శిక్ష అనుభవిస్తే ఒక ప్రభుత్వ ఉద్యోగి తన ఉద్యోగాన్ని కోల్పోతున్నప్పుడు.. జైలు శిక్ష అనుభవించిన ఒక ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి తమ స్థానం నుంచి దిగిపోకుండా ఎలా ఉంటారని మోదీ ప్రశ్నించారు. తప్పు చేస్తే సీఎం, ప్రధానినైనా తొలగించే బిల్లును విపక్షాలు వ్యతిరేకిస్తుండటంపై ప్రధాని మోదీ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆర్జేడీ, కాంగ్రెస్ నేతలు ఉంటే జైల్లో.. లేకపోతే బెయిల్‌పై ఉన్నారని ఎద్దేవా చేశారు. అందుకే అవినీతికి వ్యతిరేకంగా పోరాడడానికి ప్రవేశపెడుతున్న బిల్లును వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు.బిహార్‌లోని గయాజీలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. కొంతకాలం క్రితం

మిగతా 2వ పేజీలో..

# కెసిఆర్ పాలనలో యూరియా కొరత లేదు

- ముందస్తు ప్రణాళికతో గ్రామాల్లోకి సరఫరా
- అసమర్థ పాలనతో ఇప్పుడు అనేక సమస్యలు
- ప్రజలకు కూడా కెసిఆర్ పాలనంటే తెలిసింది
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్





**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :**
మాజీ సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణలో యూరియా కొరత ఎప్పుడూ రాలేదని, ఇప్పుడు పరిపాలన చేతకాని వారి వల్లనే ఈ దుస్థితి ఏర్పడిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిండెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ఫైర్ అయ్యారు. కేసీఆర్ ముందుచూపు,పాలన అంటే ఏంటో జనాలకు ఇప్పుడు అర్థమైందని.. రైతును అరిగోస పెడుతున్న వారి పతనం ప్రారంభమైందన్నారు.నాడు కేసీఆర్ యూరియా కోసం ముందస్తు ప్రణాళికలు రూపొందించారన్నారు. వ్యవసాయ అధికారుల నుంచి రైల్వేశాఖ వరకు కేసీఆర్ స్వయంగా సమన్వయం చేశారని చెప్పుకొచ్చారు.చిల్లర రాజకీయాలు చేసే అసమర్థుల వల్లే రైతులకు ఈ కష్టాలు వచ్చాయి. వందేళ్ల విజన్ ఉన్న

మిగతా 2వ పేజీలో..

# సీఎస్ఆర్ నిధులతో మండలానికో అంబులెన్స్

- తెలంగాణలో గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో ముందంజ
- యాదాద్రి పవర్‌ప్లాంట్ నిర్వాసితులకు ఉద్యోగ పత్రాలు
- ప్రజాభవన్ కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి



**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :**
సీఎస్ఆర్ నిధులతో ప్రతి మండలానికి అంబులెన్స్ ఏర్పాటుచేస్తాం అని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. గురుకులాల విషయంలో ప్రభుత్వం నిర్దిష్ట ప్రణాళికలతో వెళ్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎనర్జీ పాలసీ తీసుకొచ్చాం. రెప్పపాటు కూడా విద్యుత్ పోకుండా చర్యలు చేపడుతున్నాం అన్నారు. యాదాద్రి పవర్ ప్లాంట్ భూ నిర్వాసితులకు ప్రజాభవన్‌లో 320 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన భట్టి.. దాదాపు 500 మంది నిర్వాసితులకు ఉద్యోగాలు ఇస్తున్నామని

మిగతా 2వ పేజీలో..

## యూరియా కొరత పేరిట చెప్పల రాజకీయం

- కావాలనే రైతులను బజారుకీడుస్తున్నారు
- కేంద్రం నుంచి సరఫరాలో కొంత ఆలస్యం
- మెదక్ ఎంపి రఘునందన్ రావు వెల్లడి

**సిద్దిపేట- నేటి ప్రభాత సూర్య :**
ఆపరేషన్ సిందూర్ వల్ల యూరియా రావడం ఆలస్యమైందని బీజేపీ మెదక్ ఎంపీ ఎం. రఘునందన్ రావు వెల్లడించారు.శుక్రవారంసిద్దిపేటలో ఎంపీ మీడియాతో మాట్లాడుతూ కొంతమంది కావాలని యూరియా కొరత పేరిట




మిగతా 2వ పేజీలో..

## సహస్ర హంతకుడు పక్కింటి బాలుడు

- దొంగతనానికి వచ్చి హత్య చేసినట్లు గుర్తింపు
- బాలుడిని అదుపులోకి తీసుకుని విచారణ

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :**
నగరాన్ని కలచివేసిన కూకట్‌పల్లిబాలిక సహస్ర హత్య కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. 12 ఏళ్ల బాలికను హత్య చేసిన నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. దర్యాప్తులో భాగంగా పోలీసులు అనుమానితులపై దృష్టి



మిగతా 2లో..

## కమర్షియల్ బిల్డింగ్‌లో కార్పొరేట్ స్థాయి స్కూల్!

- కనీస రక్షణ చర్యలు కానరాని పాఠశాల తీరు
- ఫైర్ సేఫ్టీ పర్మిషన్ లేకున్నా కొనసాగింపు
- సాగర్ హైవేపై కొనసాగుతున్న ది ఢిల్లీ వరల్డ్ స్కూల్
- ప్రమాదకర స్థితిలో పాఠశాల నిర్వహణపై సందేహాలు
- మండల విద్యాధికారి ఉన్నట్టా? లేనట్టా?





**తుర్కయంజాల్ -నేటి ప్రభాత సూర్య :**
గుర్తింపులేని పాఠశాలలు విద్యార్థుల పాలిట శాపంగా మారుతున్నాయి. పాఠశాలకు గుర్తింపే ఉండదు.. ఫీజులు మాత్రం లక్షల్లో వసూలు చేస్తారు. అడ్మిషన్ ఫీజు, బుక్స్, యూనిఫాం, ప్రాజెక్టు తదితర పేర్లతో తల్లిదండ్రుల నుంచి అందినకాడికి లాగేస్తారు. ఏ మాత్రం విద్యాశాఖ నిబంధనలు పాటించకుండా దర్జాగా అడ్మిషన్ల ప్రక్రియ జరుపుతారు. చదువులు చెబుతూ మధ్యమధ్యలో ఫీజుల వసూళ్లు చేపట్టి డబ్బులు సంపాదిస్తారు. తుర్కయంజాల్ పురపాలక సంఘం పరిధిలోని 19 వార్డు సాగర్ రహదారి పై అనుమతి లేని సెల్లార్ తో కూడిన కమర్షియల్ బిల్డింగ్‌లో ది ఢిల్లీ వరల్డ్ స్కూల్‌కు విద్యా శాఖ నుంచి తాత్కాలిక పర్మిషన్ తీసుకొని పాఠశాలను నిర్వహిస్తున్నారు. నిబంధనలకు పాతరేసి, భవనానికి గాని.. స్కూల్‌కు ఎటువంటి అనుమతులు లేకున్నా పాఠశాల నిర్వహిస్తుండటం విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలిచింది. స్కూల్ సాగర్ ప్రధాన రహదారి కి ఉండడంతో విద్యార్థులకు ప్రాణహాని జరిగే అవకాశాలు కూడా ఉంటాయి. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని తాత్కాలిక పర్మిషన్ అధికారులు ఎలా ఇస్తారని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. పాఠశాల స్థాపించాలంటే విద్యాశాఖ నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. అందులో ముఖ్యంగా మద్యం దుఖాణాలు, ప్రార్థన మందిరాలకు పాఠశాల దూరంగా ఉండాలి. 24 శాఖల నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్(ఎన్ఓసీ) తీసుకోవాలి. భవన రిజిస్ట్రేషన్, అగ్ని మాపకం తప్పనిసరి. అయితే ది ఢిల్లీ వరల్డ్ స్కూల్ కు అనుమతి లేకుండానే పాఠశాలను నిర్వహిస్తున్నారు. అనుమతి లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలలపై మండల విద్యాధికారి చర్యలు తీసుకోకపోవడంతో మతాలబ్ ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నారు.

## వైద్యశాఖలో ఖాళీల భర్తీకి నిర్ణయం

- 1623 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

వైద్య ఆరోగ్య శాఖలో ఖాళీ పోస్టుల భర్తీకి ప్రభుత్వం సిద్ధమైంది. 1623 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది.



3లో..

## ఎసిబికి చిక్కిన జాయింట్ సబ్ రిజిస్ట్రార్

**కరీంనగర్- నేటి ప్రభాత సూర్య :** జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ రెడ్డి ఎసిబి వలకు చిక్కారు. వివరాలలోకి వెళితే.. డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ కోసం ఒక బాధితుడి నుంచి రూ.5 వేలు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ డిమాండ్ చేశాడు. అయితే, లంచం డబ్బులు ఇవ్వడం ఇష్టం లేక బాధితుడు ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న అధికారులు శుక్రవారం జాయింట్ సబ్ రిజిస్ట్రార్ లంచం డబ్బులు స్వీకరిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తదుపరి విచారణ కోసం అతనిని కరీంనగర్ కోర్టుకు తరలించనున్నట్లు ఎసిబి డిఎస్‌పి మధు తెలిపారు.



# బిజెపి అధ్యక్షుడు రామ్ అరెస్ట్ దుర్మార్గం

### బిజెపి అంటే ఎందుకంత భయం.. ప్రభుత్వంపై బండి విమర్శ

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :** భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అరెస్టును కేంద్ర మంత్రి బండి సంజయ్ ఖండించారు. చేవెళ్లలో పార్టీ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తుంటే ఎందుకు అరెస్టు చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా భారత రాష్ట్ర సమితి బాటలోనే నడుస్తోందని మండిపడ్డారు. అరెస్టులతో వైఫల్యాలు కప్పిపుచ్చుకోవాలని ప్రభుత్వం యత్నిస్తోందని విమర్శించారు. తక్షణమే రామచందర్‌రావు, కార్యకర్తలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భాజపా నాయకులను అక్రమంగా అరెస్టు చేశారని ఆ పార్టీ ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. అరెస్టు చేసిన నాయకులు, కార్యకర్తలనువిడుదల చేయాలన్నారు. చేయాల్సింది అరెస్టులు కాదు.. సమస్యల పరిష్కారమని చెప్పారు. నిరంకుశ విధానాలు మానకపోతే ప్రజాక్షేత్రంలో మట్టి కరిపించడం ఖాయమన్నారు. జీహెచ్‌ఎంసీలో సమస్యల పరిష్కారం కోరుతూ భాజపా శుక్రవారం సచివాలయం ముట్టడికి పిలుపునిచ్చింది. దీంతో పలువురు నేతలను పోలీసులు అరెస్టు చేశారు. మొయినాబాద్ వద్ద ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావును హైదరాబాద్‌కు వస్తుండగా అరెస్టు చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నట్లు కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. చేవెళ్లలో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్తున్న ఆయన్ని ఎందుకు అరెస్ట్ చేశారని ఈ సందర్భంగా పోలీసులను ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సైతం గత బీఆర్‌ఎస్ బాటలోనే పయనిస్తుందని మండిపడ్డారు. బీజేపీ కార్యకర్తల అరెస్టులతో తమ వైఫల్యాలను కప్పి పుచ్చుకోవాలనుకుంటుందంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన నిప్పులు చెరిగారు. అయినా బీజేపీ అంటే అంత భయమెందుకు అని రేవంత్ ప్రభుత్వాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన చేస్తున్న బీజేపీ కార్యకర్తలను అరెస్ట్ చేయడం సిగ్గుచేటు- అని అభివర్ణించారు. తక్షణమే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావును విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



అలాగే అరెస్టయిన బీజేపీ కార్యకర్తలందరినీ వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వానికి సూచించారు. లేని పక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు.

# హైకోర్టులో కెసిఆర్, హరీష్‌కు చుక్కెదురు

మొదటిపేజీ తరువాయి..

డొమైన్ నుంచి వెంటనే రిపోర్ట్ తొలగించాలని ఆదేశించింది. కమిషన్ 8ఇ, 8ఈ నోటీసులు ఇవ్వకుండా పిటీషనర్లపై ఆరోపణలు చేయడం చట్టవిరుద్ధమని అభిప్రాయపడింది. మూడు వారాల్లో వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఇక రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే రేవంత్ ప్రభుత్వం కమిషన్ వేసిందని కేసీఆర్, హరీష్‌రావు హైకోర్టును ఆశ్రయించారు. కమిషన్ నివేదికపై స్టే ఇవ్వాలని పిటిషన్ దాఖలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో చోటు చేసుకున్న అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను కొట్టివేయాలంటూ దాఖలు చేసిన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టులో విచారణ కొనసాగింది. అందులో భాగంగా శుక్రవారం కేసీఆర్, హరీష్‌రావు పిటిషన్లపై వాదనలు ముగిశాయి. మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని పిటిషనర్లను ఆదేశించింది. దీనిపై మధ్యంతర ఉత్తర్వులు అవసరం లేదన్న హైకోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ పీసీ ఘోష్ నివేదిక..పబ్లిక్ డొమైన్‌లో పెట్టిఉంటే.. దానిని వెంటనే తొలగించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా వేసింది. అయితే పిటిషనర్లు కోరిన విధంగా స్టే మాత్రం ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసింది. దీంతో బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావుకు హైకోర్టులో నిరాశ ఎదురైనట్లు అయింది. పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై ప్రభుత్వ నిర్ణయాన్ని కోర్టుకు అడ్వకేట్ జనరల్ శుక్రవారం తెలియజేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై అందిన నివేదకను అసెంబ్లీలో ప్రవేశ పెడతామని కోర్టుకు స్పష్టం చేశారు. అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. అంటే ఈనివేదికపై అసెంబ్లీలో చర్చించిన అనంతరం ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని కోర్టుకు ఏజీ వివరించారు. అంతలో హరీష్‌రావు తరఫు న్యాయవాది సుందరం తన వాదనలు వినిపిస్తూ.. మొత్తం కమిషన్ నివేదికపై స్టే ఇవ్వాలని కోరారు. ఈ నివేదికను అడ్డం పెట్టుకుని తమ పిటిషనర్లపై చర్యలు తీసుకునే అవకాశం ఉందని ఆయన కోర్టుకు విన్నవించారు. ఈ నేపథ్యంలో తమ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని కోరుతున్నామనికోర్టు దృష్టికి న్యాయవాది సుందరం తీసుకువెళ్లారు. అంతేకాకుండా.. జస్టిస్ పీసీ ఘోష్ నివేదికను అసెంబ్లీలో కంటే.. ముందే మీడియాకు ఇచ్చి.. తమ పిటిషనర్ల పరువుకు భంగం కలిగించారని కోర్టుకు న్యాయవాది సుందరం తెలిపారు. ఆ క్రమంలో ఈ నివేదిక అసెంబ్లీలో ప్రవేశపెట్టడానికి ఆరు నెలలు సమయం ఉంటుందని కోర్టుకు ఏజీ వివరించారు. బీఆర్‌ఎస్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుకు అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది రోజుల ముందు పగుళ్లు ఏర్పాడ్డాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. ఈ ప్రాజెక్ట్ నిర్మాణంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించింది. దాదాపు 13 నెలల పాటు వందలాది మందిని విచారించింది. అలాగే కేసీఆర్, హరీష్ రావు, ఈటల రాజేందర్‌లను సైతం విచారించి.. కమి షన్ నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి కర్మ, కర్త, క్రియా అంతా కేసీఆర్ అంటూ ఈ విచారణలో తేటతెల్లమైంది. ఈ నేపథ్యంలో ఈ కమిషన్ నివేదికను రద్దు చేయాలంటూ బీఆర్‌ఎస్ నేతలు కేసీఆర్, హరీష్‌రావు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు.





# అవినీతిపై పోరాటం ఆగదు

మొదటిపేజీ తరువాయి..

కొందరు నేతలు జైళ్ల నుంచి ఫైళ్లపై సంతకాలు చేయడం, ప్రభుత్వ ఆదేశాలు ఇవ్వడం మనం చూశాం. అవినీతికి పాల్పడే నేతలే పరిపాలన చేస్తే.. ఇక దేశంలో అవినీతిని ఎలా తొలగించగలుగుతాం అని మోదీ ప్రశ్నించారు. ఇకపై క్రిమినల్ నేతలకు అటువంటి అవకాశం ఇవ్వబోమని అన్నారు. అవినీతికి వ్యతిరేకంగా పోరాడడానికి ఎన్డీఏ ప్రభుత్వం తీసుకువస్తున్న చట్టానికి ఎవరూ అతీతులు కారని.. ప్రధాని కూడా దీని పరిధిలోకి వస్తారని పేర్కొన్నారు. తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరుసగా 30 రోజులపాటు నిర్బంధంలో ఉంటే ప్రధానమంత్రినైనా, కేంద్ర మంత్రినైనా పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించే బిల్లును అమిత్ షా ఇటీవల లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అనంతరం వాటిని సంయుక్త పార్లమెంటరీ కమిటీ- పరిశీలనకు పంపారు. తీవ్ర నేరారోపణకు గురై అరెస్టయినప్పుడు కేంద్ర మంత్రిని, రాష్ట్ర లేదా కేంద్రపాలిత ప్రాంత ముఖ్యమంత్రిని, రాష్ట్ర మంత్రిని పదవి నుంచి తొలగించేందుకు ఈ బిల్లు అనుమతిస్తుంది. కనీసం అయిదేళ్ల శిక్ష పడే నేరానికి పాల్పడి, అరెస్టయి, నెల రోజులు నిర్బంధంలో ఉంటే 31వ రోజున వారి పదవి పోయేలా నిబంధనను ఈ బిల్లులో చేర్చారు. వారంతట వారు రాజీనామా చేయకపోయినా కొత్త నిబంధన ప్రకారం పదవిని కోల్పోతారు.



# సీఎస్ఆర్ నిధులతో మండలానికో అంబులెన్స్


మొదటిపేజీ తరువాయి..

చెప్పారు. ఆనాడు భూములిచ్చింది ఇందిరమ్మే.. ఈనాడు ఉద్యోగాలు ఇస్తోంది ఇందిరమ్మ సర్కారేనని తెలిపారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని ప్రచారం చేశారు. కాంగ్రెస్ అంటేనే కరెంట్ అని నిరూపించామన్నారు భట్టి. ఉద్యోగ అవకాశాల ద్వారా పేదరికాన్ని జయించవచ్చని భట్టి విక్రమార్క అన్నారు. విద్య ద్వారా సామాజిక, ఆర్థిక వెనుకబాటును జయించవచ్చన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఉద్యోగ నియామక పత్రాల అందజేత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్, సీఎస్ఆర్ నిధులతో 25ఎకరాల్లో యంగ్‌ఇండియా స్కూల్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దీనిలో 2,600 మంది విద్యార్థులు చదువుకునేలా వసతులు కల్పిస్తున్నామన్నారు. కన్వెన్షన్, నాన్‌కన్వెన్షన్ ఎనర్జీ అందించే దిశగా చర్యలు చేపడుతున్నాం. దేశంలో అత్యధిక గ్రీన్ పవర్ ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రంగా నిలుస్తున్నాం. రాష్ట్రంలో 29 లక్షల వ్యవసాయ కనెక్షన్లకు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నాం. 51 లక్షల కుటుంబాలకు 200యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని భట్టి తెలిపారు. ఇకపోతే రాష్ట్రంలో పవర్ ప్రాజెక్టులు కట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. అధికారంలోకి రాగానే న్యూఎనర్జీ పాలసీ తీసుకొచ్చామన్నారు. 51లక్ష కుటుంబాలకు 200 యూనిట్ల ఫ్రీకరెంట్ ఇస్తున్నామని తెలిపారు. ఏటా రూ.17 వేల కోట్లు ప్రభుత్వం విద్యుత్ శాఖకు కడుతోందన్నారు భట్టి. విద్యతో పేదరికాన్ని జయించవచ్చని చెప్పారు భట్టి. అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేస్తామన్నారు. 5 ఎకరాల్లో యంగ్ ఇండియా స్కూల్ ఏర్పాటు చేసి 2600 మంది విద్యార్థులు చదువుకునే వసతులు కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్ పాలనలో యూరియా కొరత లేదు

మొదటిపేజీ తరువాయి..

కేసీఆర్‌కు, బూతులు మాట్లాడే వారికి తేడా ప్రజలకు అర్థమైంది. యూరియా కోసం ప్రత్యేకంగా గూడ్స్ ట్రెయిన్లు, లారీలు ఏర్పాటు చేయించారు. గ్రామాల్లోనే యూరియా సరఫరా చేసేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. కేసీఆర్‌పాలనలో తెలంగాణలో యూరియా కొరత ఎప్పుడూ రాలేదు. ఇప్పుడు పరిపాలన చేతకాని వారి వల్లనే ఈ దుస్థితి నెలకొంది' అని కేటీఆర్ ఫైర్ అయ్యారు. ఆగస్టు మొదటి వారం నుంచి వర్షాలు కురుస్తుండటంతో రైతులకు యూరియా ఆవశ్యకత ఏర్పడింది. వరి, పత్తి, కందులు, మొక్కజొన్న, మిర్చి, బంతి లాంటి పంటలకు యూరియా వేసే సమయం కాబట్టి రైతులు ఎగబడుతున్నారు. సహకార సంఘాలు, ప్రైవేటు డీలర్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. డిమాండుకు సరిపడా ఎరువులు లేకపోవడంతో.. దుకాణాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారు. కొన్నిచోట్ల రైతులు యూరియా కోసం వారం రోజులుగా పట్టాపాస్ పుస్తకాలు, చెప్పులు వరుసలో పెడుతున్నారు. ఇంకొందరైతే అక్కడే నిద్రిస్తున్నారని అన్నారు. కేసీఆర్ హయాంలో ఏనాడూ కూడా రైతులు ఎరువుల కోసం రోడ్డెక్కలేదు. ధర్నా చేయలేదు. కానీ కాంగ్రెస్ పాలనలో మాత్రం అన్నదాతలు అరిగోస పడుతున్నారు. ఎరువుల కోసం రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక్క యూరియా బస్తా కోసం వ్యవసాయ సహకార సంఘాల కార్యాలయాల వద్ద బారులు తీరుతున్నారు. ఈ పరిస్థితులపై కేటీఆర్ స్పందిస్తూ.. కేసీఆర్ పాలనను గుర్తు చేశారు. కేసీఆర్ హయాంలో రైతులకు జరిగిన మేలును వివరించారు. వ్యవసాయ అధికారులతో కేసీఆర్ వరుస సమీక్షలు



నిర్వహించే వారు. కేంద్రానికి సీజన్‌కు ముందే లెక్కలతో సహా వినతులు ఇచ్చేవారు. ఏపీలోని నౌకాశ్రయాలకు మన ఆఫీసర్లను పంపి ఆదేశాలు ఇప్పించేవారు. దక్షిణ మధ్య రైల్వే అధికారులకు స్వయంగా కేసీఆర్ ఫోన్లు చేసేవారు. 25 స్పెషల్ గూడ్స్ రైళ్ల ఏర్పాటుకు ప్రత్యేకంగా విజ్ఞప్తులు చేసేవారు. పక్కరాష్ట్రం రవాణా శాఖ మంత్రితో నేరుగా సంప్రదింపులు, ఏకంగా 4 వేల లారీలను రంగంలోకి దించేలా సన్నాహాలు చేసేవారు. పోర్టుల నుంచి నేరుగా మండలాలకు తరలించే వ్యూహాలు, ప్రతి రైతుకు సమయానికి యూరియా అందేలా చర్యలు తీసుకున్నారు. నేరుగా గ్రామాల్లోనే సరఫరా చేసేలా పకడ్బందీ ఏర్పాట్లు, తెలంగాణలో ఏ ప్రాంతంలోనూ కొరత రాకుండా జాగ్రత్తలు తీసుకునేవారు అని కేటీఆర్ పేర్కొన్నారు. పరిపాలన తెలియని అసమర్థులు రాజ్యమేలడం వల్లే రైతులకు ఈ కష్టాలు మిగిలాయన్నారు.

# సహస్ర హంతకుడు పక్కింటి బాలుడు

మొదటిపేజీ తరువాయి..

సారించగా, సహస్ర ఇం టికి పక్కనే ఉన్న భవనంలో నివసిస్తున్న పదవ తరగతి విద్యార్థి ఈ హత్యకు కారణమని తేలింది. అతడు దొంగతనం కోసం సహస్ర ఇంట్లోకి వెళ్లగా, ఆ సమయంలో బాలికను చూసి భయపడి ఆమెను హతమార్చినట్లు-విచారణలో వెల్లడైంది. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. సహస్ర హత్య వెనుక ఉన్న నిజం వెలుగులోకి రావడంతో, స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. ఈ ఘటనతో కూకట్‌పల్లి ప్రాంతం తీవ్ర కలకలం రేపింది. చిన్నారి హత్యకు కారణమైన నిందితుడు ఒక స్కూల్ విద్యార్థి కావడం స్థానికులను మరింత షాక్‌కు గురి చేసింది. ప్రస్తుతం పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## ఓట్ల తొలగింపులో పార్టీల తీరుపై విస్మయం

- బూత్ స్థాయిలో ఓటర్లకు సాయం చేయాలని సుప్రీం సూచన
- ఓటు సవరణకు గడువు పెంచాలని ఈసీకి ఆదేశం



**న్యూఢిల్లీ- నేటి ప్రభాత సూర్య :** బిహార్‌లో ఓటరు జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ వివాదంపై సుప్రీం కోర్టు విచారణ కొనసాగింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చి బెంచ్ విచారణ చేపట్టింది. డిలీట్ చేసిన ఓటర్ పేర్లను సరిదిద్దే విషయంలో రాజకీయ పార్టీలు అచేతనంగా ఉండటంపై న్యాయస్థానం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. వీరు వెళ్లి సవరణలో పాల్గొనాలని సూచించింది. రాజకీయ పార్టీలు చొరవతో ముందుకు రావాలని కోరింది. అదే సమయంలో ఎస్ఐఆర్ ప్రక్రియ ఓటర్ ఫ్రెండ్లీగా ఉండాలని పునరుద్ఘాటించింది. డిలీట్ చేసిన పేర్ల విషయంలో ఆధార్ కార్డు లేదా.. ఏదైనా ఆమోదయోగ్య పత్రంతో పాటు చేసే ఆన్‌లైన్ సబ్మిషన్లను అనుమతిస్తాం అని న్యాయస్థానం పేర్కొంది. పేర్ల తొలగింపులపై భారీ సంఖ్యలో ప్రజల నుంచి స్పందన వస్తే దరఖాస్తు సమర్పణల తుది గడువును ఎందుకు పొడిగించకూడదని జస్టిస్ కాంత్ ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించారు. మరోవైపు ఈ ప్రక్రియలో బిహార్ రాజకీయ పార్టీలు కూడా భాగస్వాములై తమ బూత్ స్థాయి ఏజెంట్లతో ఓటర్లకు సాయం చేయాలని కోర్టు పేర్కొంది. సూచించిన 11 పత్రాలు లేదా ఆధార్ ఏదైన ఒక దానిని సమర్పించి.. పేరు తొలగింపుపై అభ్యంతరాలు తెలియజేస్తూ.. పేరు తిరిగి చేర్చాలనే దరఖాస్తు ఇవ్వాలని వెల్లడించింది. అదే సమయంలో రాజకీయ పార్టీల మధ్య వివాదాలకు ఓటర్లకు లంకె పెట్టకూడదని జస్టిస్ కాంత్ సూచించారు. ?బిహార్(ఇఠశస)లో ఓటరు జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)లో తీవ్ర స్థాయిలో అవకతవకలు జరిగాయంటూ దుమారం రేగింది. దీనిని సవాలు చేస్తూ సుప్రీం కోర్టులో దాఖలైన పిటిషన్లపై న్యాయస్థానం విచారణ చేపట్టింది. ఇప్పటికే ఎస్ఐఆర్ కింద తొలగించిన 65 లక్షల మంది పేర్లను కోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల కమిషన్ వెల్లడించింది. తొలగించిన ఓటర్ల పేర్లను వెల్లడించాలని విపక్షాలు కొన్ని రోజులుగా డిమాండ్ చేస్తున్నాయి. ఈ క్రమంలో రాజకీయ పార్టీలో వెళ్లి ఓటు నమోదును పూర్తి చేయించాలని సూచించింది.

## చిమ్మ చీకట్లో విశ్వనగరం



- కాంగ్రెస్ ప్రభుత్వంపై కిషన్ రెడ్డి విమర్శలు

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :** విద్యుత్ సరఫరా గురించి గొప్పలు చెబుతున్న ప్రభుత్వం వీధి లైట్లు వెలగని నగరం దేశంలో ఏదైనా ఉందంటే అది హైదరాబాదేనని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. చీకటి పడితే వీధిలైట్లు- వెలగక దయనీయమైన పరిస్థితులు నెలకొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం ఎక్కడ ఉందో అక్కడే వెలుగులా అని విమర్శించారు. ప్రభుత్వం రియల్ హైదరాబాద్ వదిలేసి.. రియల్ ఎస్టేట్ హైదరాబాద్ చుట్టూ తిరుగుతోందని ధ్వజమెత్తారు. నాడు కేసీఆర్ విశ్వనగరం అన్నారు.. రేవంత్‌రెడ్డి అంతకన్నా మహా విశ్వనగరం అంటున్నారని ఎద్దేవా చేశారు. చిమ్మ చీకట్లు- అలముకోవడం మహానగరమా? అని ప్రశ్నించారు. మౌలిక వసతుల్లేక నగర ప్రజలు అల్లాడుతున్నారని, ఎక్కడ చూసినా డ్రైనేజీ ఓవర్ ఎ÷-లో అవుతోందన్నారు. హౌస్ అరెస్టులు చేసేంత భయం ప్రభుత్వానికి ఎందుకని ప్రశ్నించారు. తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిని, పార్టీ నేతలను అరెస్ట్ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందన్నారు. అరెస్ట్‌లకు భయపడేది లేదని, అన్నింటికీ సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. బేషరతుగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల డిమాండ్లపై చర్చకు రావాలని డిమాండ్ చేశారు.

## ఉమ్మడి జిల్లా అభివృద్ధికి 1200కోట్లు విడుదల


- మంత్రి సీతక్క చొరవతో నిధులు మంజూరు



**వరంగల్- నేటి ప్రభాత సూర్య :** ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధి పనుల కోసం తెలంగాణ ప్రభుత్వం భారీగా నిధులు విడుదల చేసింది. పంచాయతీ రాజ్ శాఖ నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాకు నిధులు విడుదల అయ్యాయి. మంత్రి సీతక్క చొరవతో పంచాయతీరాజ్ శాఖకు రూ.1200 కోట్లు- నిధులు విడుదలయ్యాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ ఇంటిగ్రేటెడ్ భవనాలు, అదేవిధంగా ఎంపీపీ భవనాలకు నిధులు మంజూరయ్యాయి. మరోవైపు.. మహబూబాబాద్ జిల్లాలోని గంగారం, కొత్తగూడ మండలాల్లో మంత్రి సీతక్క పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ నూతన రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సన్నబియ్యం పథకాన్ని ఇందిరమ్మ ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఉద్ఘాటించారు మంత్రి సీతక్క. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఇందిరమ్మ ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడించారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని స్పష్టం చేశారు. గృహజ్యోతి పథకం కింద రూ.500లకే సబ్సిడీ గ్యాస్ పంపిణీ చేస్తున్నామని వివరించారు. ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించాలని మంత్రి సీతక్క కోరారు.

## సిపిఐ కార్యదర్శిగా కూనంనేని

- వరుసగా రెండోసారి ఎన్నిక



**హైదరాబాద్- ప్రభాత సూర్య :** సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మరోసారి ఎన్నికయ్యారు. గాజులరామారంలో జరిగిన సీపీఐ 4వ రాష్ట్ర మహాసభల్లో ఆయన పేరును పార్టీ సీనియర్ నేత పల్లా వెంకట్‌రెడ్డి ప్రతిపాదించగా.. మరో నేత శంకర్ బలపరిచారు. కూనంనేని వరుసగా రెండోసారి రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. మూడేళ్లపాటు- ఆయన పదవిలో కొనసాగనున్నారు. కొత్తగూడెం పట్టణానికి చెందిన సాంబశివరావు పార్టీలో సాధారణ కార్యకర్తగా ప్రస్థానం ప్రారంభించారు. విశాలాంధ్ర పత్రికలో జర్నలిస్టుగానూ పనిచేశారు. 1984లో కొత్తగూడెం పట్టణ సీపీఐ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1987లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరిగిన కొత్తగూడెం మండల పరిషత్ ఎన్నికల్లో ఘన విజయం సాధించి మండలాధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టారు. 2005లో ఉమ్మడి ఖమ్మం జిల్లా పార్టీ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1999, 2004 ఎన్నికల్లో సుజాతనగర్ శాసనసభ నియోజకవర్గం నుంచి పోటీ- చేసి ఓటమిపాలయ్యారు. 2009లో కొత్తగూడెం నుంచి పోటీ- చేసి.. అప్పటి మంత్రి వనమా వెంకటేశ్వరరావును ఓడించి శాసనసభలో అడుగుపెట్టారు. తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను గుర్తించి ఖమ్మం జిల్లాలో 450 కి.మీ. పాదయాత్ర నిర్వహించారు. 2023 ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి ఎమ్మెల్యేగా ఆయన విజయం సాధించారు.

నేటి ప్రభాత సూర్య
జాతీయ తెలుగు దిన పత్రిక
TGTEL/25/A0784
GENERAL జనరల్

# శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న వరద

**నిజామాబాద్ :** జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో 16 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీ-ఎంసీలు కాగా.. ప్రస్తుతం 79.65 టీ-ఎంసీలుగా నమోదైంది. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 80 వేల క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 78,812 క్యూసెక్కు లుగా ఉంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు 16 గేట్ల ద్వారా 49,280 క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 6,500 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 1,500 క్యూసెక్కులు, ఇందిరమ్మ వరద కాలువ ద్వారా 20 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు కాగా.. ప్రస్తుతం 1090.8 అడుగులకు చేరుకుంది.



# వీధికుక్కలకు ఆహారం వీధుల్లో పెట్టొద్దు!

- వీధికుక్కల బెడదపై సుప్రీం కీలక ఆదేశాలు
- బహిరంగ ప్రదేశాల్లో ఆహారం నిషేధం
- నిర్దేశిత స్థలాల్లోనే ఆహార ఏర్పాట్లు



**న్యూఢిల్లీ- నేటి ప్రభాత సూర్య :** వీధి కుక్కల బెడదకు సంబంధించి సుప్రీంకోర్టు శుక్రవారం కీలక ఆదేశాలు వెలువరించింది. వీధులు లేదా బహిరంగ ప్రదేశాల్లో వీటికి ఆహారం అందించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. వీధి కుక్కలకు నిర్దేశిత ప్రాంతాల్లోనే ఆహారం అందించాలని, ఇందుకోసం అధికారులు ప్రతి వార్డులో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయాలని పేర్కొంది. ఆ ప్రాంతాల్లో మాత్రమే ఆహారం అందించాలని సూచిస్తూ నోటీసు బోర్డులు ఏర్పాటు చేయాలని వెల్లడించింది. దీనిని ధిక్కరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించింది. వీధి కుక్కల బెడదను తగ్గించే క్రమంలో సుప్రీం ఈ ఆదేశాలు ఇచ్చింది. ఎట్టి పరిస్థితుల్లోనూ వీధుల్లో కుక్కలకు ఆహారం ఇవ్వకూడదని, ఈ ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నియంత్రణ లేకుండా ఆహారం ఇవ్వడం వల్ల అవాంఛనీయ ఘటనలు చోటు-చేసుకుంటున్నాయని వచ్చిన నివేదికలను పరిగణనలోకి తీసుకొని ఈ ఆదేశాలు జారీచేస్తున్నట్లు- చెప్పింది. సామాన్య పౌరులు వీధుల్లో నడిచేటప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇటు-వంటి పద్ధతికి స్వస్తి పలకాలని అభిప్రాయపడింది. దిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతం నుంచి వీధి కుక్కలన్నింటినీ తరలించాలంటూ ఆగస్టు 11న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. వీటి దాడులు పెరిగిపోవడంపై ఆందోళన వ్యక్తంచేసిన ద్విసభ్య ధర్మాసనం దిల్లీలో అవి ఎక్కడా కనిపించ డానికి వీల్లేదని, వీటిని షెల్టర్లకు తరలించాలని తీర్పు చెప్పింది. ఈ ఆదేశాలపై తీవ్ర అభ్యంతరాలు, నిరసనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి. అంజరియాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారించింది. ఈసందర్భంగా రేబిస్ లక్షణాలు లేదా విపరీత ప్రవర్తన కలిగిన కుక్కలు మినహా ఇప్పటివరకు షెల్టర్లకు తరలించిన వాటిని విడుదల చేయాలని ఆదేశించింది. వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేసిన తర్వాత వాటిని ఎక్కడ నుంచి తీసుకొచ్చారో అక్కడే విడిచిపెట్టాలని పేర్కొంది. ఇందుకు సంబంధించి ఆగస్టు 11న ఇచ్చిన తీర్పును సవరించిన న్యాయస్థానం.. తదుపరి విచారణ ఎనిమిది వారాలకు వాయిదా వేసింది.

# 25న తెలంగాణ కేబినేట్ భేటీ

- బిసి రిజర్వేషన్లు, స్థానిక ఎన్నికలపై చర్చ
- కాళేశ్వరం నివేదికపైనా చర్చించే అవకాశం



**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :** తెలంగాణ మంత్రివర్గ సమావేశం సచివాలయంలో ఈనెల 25న సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరగనుంది. స్థానిక సంస్థల ఎన్నికలపై కేబినెట్ నిర్ణయం తీసుకునే అవకాశముందని సమాచారం. మరో వైపు పంచాయతీ ఎన్నికల కోసం హైకోర్టు విధించిన గడువు సెప్టెంబరు 30తో ముగియనుంది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, ఎన్నికలపై కేబినెట్ నిర్ణయం తీసుకునే అవకాశముంది. శనివారం జరగనున్న టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ- సమావేశంలో కాంగ్రెస్ పార్టీ వ్యూహం ఖరారు కానుంది. రాష్ట్రపతి వద్ద తేలకపోతే పార్టీ పరంగా బీసీలకు 42శాతం సీట్లు- ఇవ్వాలని నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. సోమవారం జరగనున్న కేబినెట్ సమావేశంలో పాత రిజర్వేషన్ల ప్రకారం.. ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయం తీసుకొని రాష్ట్ర ఎన్నికల సంఘానికి సమాచాం పంపించే వీలుంది. కాళేశ్వరం కమిషన్ నివేదిక అంశంలో హైకోర్టు విచారణపై కూడా చర్చించి.. అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై కూడా నిర్ణయం తీసునే అవకాశం ఉంది. దీనికోసం ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కాళేశ్వరం నివేదికపై ఎప్పుడు చర్యలు తీసుకుంటారని ఇటీవల హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించగా అసెంబ్లీలో నివేదిక ప్రవేశపెట్టిన అనంతరం చర్యలు తీసుకుంటామని న్యాయస్థానానికి ప్రభుత్వం సమాధానం ఇచ్చింది. ఈ నేపథ్యంలో కాళేశ్వరం నివేదికను అసెంబ్లీలో ప్రవేశ పెట్టేందుకు ఈ భేటీలో తేదీలను ఖరారు చేయనున్నట్టుగా తెలుస్తోంది.

# సూర్యాపేటలో సుపారీ గ్యాంగ్ కలకలం

- మర్డర్ నుంచి తప్పించుకున్న ముగ్గురు

**సూర్యాపేట- నేటి ప్రభాత సూర్య :** సూర్యాపేట జిల్లా కేంద్రంలో మరోసారి సుపారీ మర్డర్ యత్నం బయటపడడంతో స్థానికంగా కలకలం చెలరేగింది. సమాచారం ప్రకారం, ఓ బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురిని లక్ష్యంగా చేసుకుని ఒక సుపారీ గ్యాంగ్ కారులో వెంబడించింది. అప్రమత్తమైన వారు వెంటనే బైక్ దిగి సమీపంలోని వైన్స్‌లోకి పరుగెత్తడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. వైన్స్‌లో ఉన్న స్థానికులు గ్యాంగ్‌పై దాడికి దిగగా, పరిస్థితి చేజారిపోతుందనుకున్న వారు తాము వచ్చిన కారులో అక్కడి నుంచి పరారయ్యారు. ఈ సంఘటనతో ప్రజల్లో గందరగోళం నెలకొంది. ఇక, ఇదే ప్రాంతంలో రెండు నెలల క్రితం కూడా ఇలాంటి సుపారీ మర్డర్ యత్నం జరిగినట్లు- స్థానికులు గుర్తుచేస్తున్నారు. అప్పటి నుంచి పెద్దగా శాంతించని ఈ పరిణామాలు మళ్లీ చోటు-చేసుకోవడంతో ఇక్కడ సుపారీ గ్యాంగ్‌ల దాడులు పెరుగుతున్నాయా?' అనే సందేహం కలుగుతోంది. వరుసగా ఇలాంటి ఘటనలు జరగడం వల్ల సూర్యాపేటలో భయాందోళనలు మరింత పెరిగాయి.

# లైసెన్స్‌డు కేబుల్స్ తప్ప అన్నీ తొలగించండి

- పుట్టినరోజు నాడే బాలుడు తండ్రికి కొరివి పెట్టాడు
- ఈ ఘటన తనను ఎంతో కలచి వేసింది
- కేబుల్ వైర్ల తొలగింపు విచారణలో జస్టిస్ బీమపాక



**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :** పుట్టిన రోజు నాడే తండ్రికి తలకొరివి పెట్టిన బాలుడు ఘటనపై జస్టిస్ నగేష్ బీమాపాక ఉద్వేగ భరిత వ్యాఖ్యలు చేశారు. కేకు కోయాల్సిన తొమ్మిదేళ్ల బాలుడు తలకొరివి పెట్టడం తనను తీవ్రంగా కలచి వేసిందని జస్టిస్ నగేష్ భావోద్వేగానికి గురయ్యారు. విద్యుత్ ప్రమాదంపై ఎవరికి వారు చేతులు దులుపుకుంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రజల ప్రాణాలకు బాధ్యులు ఎవరని జస్టిస్ నగేష్ బీమాపాక ప్రశ్నించారు. ఈ ఘటనతో ప్రతి హృదయం పగిలిపోయిందని.. అందరం బాధ్యులమేనని జస్టిస్ నగేష్ పేర్కొన్నారు. ఈ విషయంలో సమాజం సిగ్గుతో తలదించుకోవాలని జస్టిస్ బీమాపాక నగేష్ చెప్పుకొచ్చారు. నెట్‌వర్క్ కేబుల్ వైర్ల వ్యవహారంపై తెలంగాణ హైకోర్టులో శుక్రవారం మరోసారి విచారణ జరిగింది. రామంతాపూర్ ఘటన తర్వాత హైదరాబాద్‌లోని పలు ఏరియాల్లో కేబుల్ వైర్లను విద్యుత్ అధికారులు కట్ చేశారు. వైర్లకు తిరిగి కనెక్షన్ ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని ఎయిర్‌టెల్ సంస్థ కోరింది. అయితే, ఎయిర్‌టెల్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. లైసెన్సు తీసుకున్న కేబుల్స్ తప్ప ఏవీ ఉంచవద్దని జస్టిస్ నగేష్ బీమాపాక ఆదేశాలు జారీ చేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటంపై జస్టిస్ నాగేష్ బీమాపాక సీరియస్ అయ్యారు. రామంతాపూర్‌లో ఐదుగురు మరణించిన ఘటనను ఈ సందర్భంగా జడ్జి ప్రస్తావించారు. తదుపరి విచారణను వచ్చే సోమవారానికి తెలంగాణ హైకోర్టు వాయిదా వేసింది.

# కేజ్రీవాల్ జైలులో ఉంటూ ప్రభుత్వాన్ని నడిపారు



- రేపు ఎవరైనా ఇలాగే చేస్తే ..ఎలా ?
- అందుకే అవినీతి కేసుల్లో సమస్య రాకుండా చట్టం
- విపక్షాల అభ్యర్థి సుదర్శన్ రెడ్డి వామపక్షవాది
- కేరళ పర్యటనలో హోంమంత్రి అమిత్ షా

**తిరువనంతపురం :** తప్పు చేస్తే నేతలను పదవుల నుంచి తొలగించే బిల్లును తీసుకు రావడాన్ని హోం మంత్రి అమిత్‌షా సమర్థించారు. అవినీతి తదితర ఆరోపణల్లో జైలుకు వెళ్లినా పదవులు పట్టుకుని వేళ్లాడడంవల్లనే ఈ బిల్లు ఆవశ్యకత ఏర్పడిందని అన్నారు. కేరళలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో అమిత్‌షా దీనిపై మాట్లాడారు. భారత్ స్వాతంత్య్రం పొందిన ఈ 75 ఏళ్లలో ఇలాంటి బిల్లు ఎప్పుడూ రాలేదన్నారు. ఈ చట్టం ఎంత అవసరమో తెలుపుతూ.. దిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్ ప్రస్తావన తీసుకొచ్చారు. కేజ్రీవాల్ సీఎంగా జైలులో ఉంటూనే ప్రభుత్వాన్ని నడిపారని చెప్పారు. జైలులో ఉండి ప్రభుత్వాన్ని నడిపే సీఎం దేశానికి అవసరమా? నైతికత ఎక్కడుంది? కేజ్రీవాల్ లిక్కర్ పాలసీ కుంభకోణం లో జైలుకు వెళ్లి అక్కడ నుంచి ప్రభుత్వాన్ని నడిపారు. ఇలాంటి పరిస్థితుల్లో రాజ్యాంగ సవరణ చేయాల్సిన అవసరంఉందా.. లేదా? గతంలో దిల్లీని భాజపా ప్రభుత్వం పాలించింది. కానీ,ఇలాంటి పరిస్థితులు ఎప్పుడూ రాలేదు. కేజ్రీవాల్ అరెస్టయిన వెంటనే సీఎం పదవికి రాజీనామా చేసి ఉంటే.. ఇప్పుడు ఈ బిల్లు ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉండేది కాదు. ఇలాంటి నిబంధనను రాజ్యాంగం రూపొందించినప్పుడే ఎందుకు పెట్టలేదని ప్రశ్నిస్తున్నారు. భవిష్యత్తులో జైలుకు వెళ్లే వ్యక్తులు ప్రజాప్రతినిధులవుతారని ఆ సమయంలో ఊహించి ఉండకపోవచ్చు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వమైనా, ప్రతిపక్షాలైనా నైతిక బాధ్యత తీసుకోవాలని అమిత్ షా అన్నారు. తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరుసగా 30రోజులపాటు నిర్బంధంలో ఉంటే ప్రధానమంత్రినైనా, కేంద్ర మంత్రినైనా పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించే బిల్లును అమిత్ షా ఇటీవల లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అనంతరం వాటిని సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపారు. కనీసం అయిదేళ్ల శిక్ష పడే నేరానికి పాల్పడి, అరెస్టయి, నెల రోజులు నిర్బంధంలో ఉంటే 31వ రోజున వారి పదవి పోయేలా నిబంధనను ఈ బిల్లులో చేర్చారు. వారంతట వారు రాజీనామా చేయకపోయినా కొత్త నిబంధన ప్రకారం పదవిని కోల్పోతారు. కొచ్చిలో శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్రమంత్రి అమిత్‌షా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన తన ప్రసంగంలో కాంగ్రెస్ పార్టీని, ప్రతిపక్షాల ఉపరాష్ట్రపతి అభ్యర్థి సుదర్శన్ రెడ్డిని లక్ష్యంగా చేసుకొని తీవ్ర ఆరోపణలు చేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగాఉంటూ సుదర్శన్‌రెడ్డి వామపక్ష తీవ్రవాదానికి అనుకూలంగా తీర్పులు ఇచ్చారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ వామపక్షాల ఒత్తిడితో సుదర్శన్ రెడ్డిని ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక చేసిందని అన్నారు. ఆయన అభ్యర్థిగా ఎంపిక చేయడంతో కేరళలో కాంగ్రెస్ విజయానికి మిగిలి ఉన్న అవకాశం కూడా చేజారిపోయిందని విమర్శించారు. వామపక్ష తీవ్రవాదానికి సహాయం చేయడానికి సల్వాజుడుం లాంటి వారికి వ్యతిరేకంగా తీర్పులు ఇచ్చిన వ్యక్తి ప్రతిపక్షాల ఉపరాష్ట్రపతి అభ్యర్థి సుదర్శన్ రెడ్డి అని అన్నారు. ఆ రోజు ఆయన అలాంటి నిర్ణయం తీసుకోకపోతే 2020 నాటికి వామపక్ష తీవ్రవాదం అంతమై ఉండేదని పేర్కొన్నారు. వామపక్షాల ఒత్తిడితోనే కాంగ్రెస్ పార్టీ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సుదర్శన్ రెడ్డి ఎంపిక చేసిందని ఆరోపించారు. ఆయన సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్న సమయంలో అనేక ప్రసిద్ధమైన తీర్పులు ఇచ్చారు. వాటిలో సల్వా జుడుం కేసు చాలా ముఖ్యమైనది. 2011లో జస్టిస్ సుదర్శన్ రెడ్డి,జస్టిస్ ఎస్ఎస్ నిజ్జర్‌లతో కూడిన ధర్మాసనం సల్వాజుడుంను రద్దు చేసింది. సల్వాజుడుం అనేది.. కొంతమంది గిరిజన యువకులు మావోల తిరుగుబాటును ఎదుర్కోవడానికి ఏర్పాటయ్యింది.

# కెసిఆర్ కుటుంబమంతా డ్రామా ఆర్టిస్టులే

- కెటిఆర్‌కు రాజకీయంగా మెచెర్టీ లేదు
- మీడియా సమావేశంలో జగ్గారెడ్డి విమర్శలు

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :**

కేటీఆర్‌కి రాజకీయంగా మెచ్యూరిటీ రాలేదని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి మరోసారి మండిపడ్డారు. శుక్రవారం గాంధీభవన్‌లో జగ్గారెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. పదేళ్లు మంత్రిగా పని చేసిన కేటీఆర్‌కి రాజకీయంగా మెచ్యూరిటీ- రాలేదని ఎద్దేవా చేశారు. కేసీఆర్ దీక్ష.. కాంగ్రెస్ పార్టీ చేసిన డిజైన్ అని అభివర్ణించారు. కేసీఆర్ జాక్‌పాట్ కొట్టాడు. కానీ మా వాళ్ళు కొట్ట లేక పోయారన్నారు. అన్నం లేకుండా కేసీఆర్ ఉండగలడా? అంటూ ఈ సందర్భంగా ఆయన సందేహం వ్యక్తం చేశారు. బాధ్యతాయుతంగా మాట్లాడాల్సిన కేటీ-ఆర్ నోరు జారుతున్నాడంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమయంలో కేటీఆర్ అమ్మమ్మ, తాతయ్య ఉండి ఉంటే.. అతడి చెంపపై కొట్టేవారన్నారు. కేసీఆర్ కుటుంబమంతా డ్రామా ఆర్టిస్టులని ఎద్దేవా చేశారు. తన ప్రశ్నలకు సమాధానం చెప్పే పరిజ్ఞానం కేటీ-ఆర్‌కి ఉందా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. కేసీఆర్ కుటు-ంబానికి క్యారెక్టర్ లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇవ్వక పోతే మీరెవరో ప్రజలకు కూడా తెలియక పోయేదని వ్యంగ్యంగా అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు నీకు చిల్లర పార్టీ అయిందా? అంటూ కేటీ-ఆర్‌పై నిప్పులు చెరిగారు. నీ కుటు-ంబమంతా.. సోనియా గాంధీ ఇంటికి వెళ్లినప్పుడు చిల్లర పార్టీ అనిపించ లేదా? అంటూ కేటీఆర్‌కు ఈ సందర్భంగా జగ్గారెడ్డి చురకలంటించారు. కేసీఆర్ కుటుంబం.. రాజకీయంగా వెలుగుతుందంటే అందుకు కారణం కాంగ్రెస్ పార్టీనే అని ఆయన వివరించారు. కాంగ్రెస్ వల్లే తెలంగాణ వచ్చిందని కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించిన విషయాన్నికేటీ-ఆర్ అప్పుడే మర్చిపోయాడా? అంటూ ప్రశ్నించారు. కేసీఆర్ రాజకీయ పాఠాలు నేర్చుకున్నది కాంగ్రెస్ పార్టీ నుంచే కదా అని ఆయన వివరించారు. కాంగ్రెస్ థర్డ్ క్లాస్ అయితే మీ నాన్న కేసీఆర్ కూడా థర్డ్ క్లాస్ అయినట్టేనంటూ కేటీ-ఆర్ తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ చరిత్రను కేసీఆర్‌ను అడిగి తెలుసుకోవాలంటూ కేటీ-ఆర్‌కు ఈ సందర్భంగా సూచించారు. తెలంగాణ బిడ్డ సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వాల్సింది పోయి కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేస్తారా? అవకాశవాద రాజకీయాలు స్పష్టంగా కనిపిస్తున్నాయంటూ ఈ సందర్భంగా కేసీఆర్, కేటీ-ఆర్ వైఖరులను టీ-పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఎండగట్టారు.



# యూరియా కొరత పేరిట చెప్పుల రాజకీయం

మొదటిపేజీ తరువాయి..

చెప్పులను లైన్‌లో పెట్టించి మరీ రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. 50 వేల మెట్రిక్ టన్నుల యూరియాను వారం రోజుల్లో తెలంగాణకు తీసుకు వస్తామని ఆయన హామీ ఇచ్చారు. రైతులకు యూరియా ఇచ్చేది బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కాదని కేంద్ర ప్రభుత్వం మాత్రమే అని ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు గుర్తు చేశారు. రైతులందరికి సరిపడే యూరియాను వారం రోజుల్లో అందిస్తామన్నారు. కొంత మంది యూరియాను కృత్రిమ కొరత సృష్టిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా అధికారులకు ఆయన ఆదేశించారు. రాజకీయ నాయకుల తప్పుడు ఆరోపణలను నమ్మవద్దని.. అలాగే ఆందోళన చెంద వద్దంటూ రైతులకు సూచించారు. ఇక ఫ్లెక్సీల కోసం దిగజారి రాజకీయం తాము చేయమని స్పష్టం చేశారు. ఇలాంటి తప్పుడు పనులు చేసే వారికి వచ్చే ఎన్నికల్లో డిపాజిట్ సైతం రాదని మెదక్ ఎంపీ రఘునందన్ రావు జోస్యం చెప్పారు. రాష్ట్రాల మధ్య వివక్ష చూపుతున్నారంటూ ప్రధాని మోదీపై కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. రాష్ట్రాల్లో ఎవరు అధికారంలో ఉన్నా కేంద్ర ప్రభుత్వం సమ దృష్టితో.. సమన్యాయం చేస్తుందని తెలిపారు. ఒక్కొక్క గ్రామ పంచాయతీ భవనానికి రూ. 20 లక్షలు, అంగన్వాడీ కేంద్రానికి రూ. 10 లక్షలు నిధులను కేంద్రం విడుదల చేస్తుందని చెప్పారు. సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్, దుబ్బాక, సిద్దిపేట నియోజక వర్గాల్లో 26 అంగన్వాడీ కేంద్రాలకు రూ. 2. 8 కోట్లు- కేటాయించారని వివరించారు. కాంగ్రెస్ నాయకులు పనుల జాతర పేరిట కొబ్బరి కాయలు కొడుతున్నారంటూ ఎద్దేవా చేశారు. కేంద్రం ఇచ్చే నిధులను వారు ఎలా ఖర్చు చేస్తారని ప్రశ్నించారు. వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. మెదక్ జిల్లాలోని 27 అంగన్వాడీ కేంద్రాలకు రూ. 2. 10 కోటలు నిధులు మంజూరు చేశామని వివరించారు. మెదక్ లోక్ సభ నియోజకవర్గ పరిధిలో 56 అంగన్వాడీ కేంద్రాలకు రూ. 4. 6 కోట్ల నిధులు కేంద్రం విడుదల చేసిందని గుర్తు చేశారు. పనుల జాతర పేరిట రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించే పనుల్లో 75 శాతం నిధులు కేంద్రం ఇచ్చిందని.. మిగిలిన 25 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని ఎంపీ రఘునందన్ రావు తెలిపారు.



# గౌరవెల్లి ప్రాజెక్టుకు భూసేకరణ

**మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి**



**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :** గౌరవెల్లి ప్రాజెక్టుకు భూసేకరణ జరుగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రాజెక్టులను పూర్తి చేయడం,రైతులకు న్యాయం చేయడం లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మల్లారంలో ఆయన పర్యటించారు. అంగన్వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వీర్లగడ్డ తండాలో పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హనుమకొండ జిల్లాలో భూసేకరణకు రూ.25 కోట్లు- కేటాయించినట్లు చెప్పారు. ఎన్‌జీటీ కేసుకు సంబంధించి ప్రభుత్వం రూ.10 కోట్లు- చెల్లించిందని తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తిచేసి ఈ ప్రాంత రైతులకు నీరందిస్తామని పేర్కొన్నారు. రైతులను రెచ్చగొట్టేలా భారత రాష్ట్ర సమితి వ్యవహరిస్తోందని విమర్శించారు. 42 శాతం రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేసి రిజర్వేషన్లు సాధించుకోవాలన్నారు.

# వైద్యశాఖలో ఖాళీల భర్తీకి నిర్ణయం

**1623 స్పెషలిస్ట్‌ల భర్తీకి నోటిఫికేషన్**

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :** తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడానికి ప్రభుత్వం సిద్ధమైంది. 1623 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల భర్తీకి రేవంత్ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని హాస్పిటల్‌లో 1616,ఆర్టీసీ హాస్పిటల్‌లో 7 పోస్టులు భర్తీ చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆయా దరఖాస్తులకు సెప్టెంబర్ 8 నుంచి 22వ తేదీ వరకూ గడువు విధించింది ప్రభుత్వం. ఈ పోస్టులభర్తీతో వైద్య విధాన పరిషత్‌లోని హాస్పిటళ్లలో స్పెషలిస్ట్ డాక్టర్ల సంఖ్య పెరుగనున్నాయి. జిల్లా, ఏరియా హాస్పిటళ్లు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో వైద్య సేవలు మరింత మెరుగవనున్నాయి. పల్లెలకు స్పెషాలిటీ- వైద్య సేవలు చేరువ అవనున్నాయి. ఆరోగ్యశాఖలో ఇప్పటికే సుమారు 8 వేల పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. మరో 7 వేల పోస్టులకు భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది.

# పార్లమెంట్‌ను అపహాస్యం చేసిన కాంగ్రెస్

- సమావేశల్లో చర్చించకుండా కాలయాపన
- వెంకయ్య నాయుడు పోటీ చేసినప్పుడు తెలుగు ప్రైడ్ గుర్తుకు రాలేదా
- కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ ఎంపి లక్ష్మణ్

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :** వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు ముగిశాయి. 21 రోజుల వాడివేడిగా సాగిన పార్లమెంట్ సమావేశాలు గురువారంతో ముగిసినట్లు బీజేపీ ఎంపీ లక్ష్మణ్ తెలిపారు. పార్లమెంట్‌లో కాంగ్రెస్ అలజడి, అల్లర్లు చేస్తూ.. ప్రజాస్వామ్యానికి మచ్చ తెచ్చేలా వ్యవహరించిందని ఆరోపించారు. కాంగ్రెస్ ద్వంద నీతి అవలంబించిందని విమర్శించారు. మణిపూర్, ఆపరేషన్ సింధూర్‌పై చర్చ జరగాలని మొదట డిమాండ్ చేసిందని పేర్కొన్నారు. రాజ్యసభలో ఆపరేషన్ సింధూర్ చర్చలో పాల్గొనకుండా తోకముడిచిందని ఆయన ఎద్దేవా చేశారు. పదిహేను బిల్లులు ఉభయ సభల్లో ఆమోదం తెలిపితే ఒక్కచర్చలో కూడా కాంగ్రెస్ పాల్గొనలేదని తెలిపారు. చర్చలో పాల్గొనకుండా కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్‌కి ఎజెండా లేకుండా పోయిందని విమర్శించారు. పార్లమెంట్‌లో లేని చర్చకు ఆరోపణలతో రాహుల్ గాంధీ మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. చరిత్మకమైన బిల్లులో కాంగ్రెస్ ఎక్కడ చర్చకు రాలేదని స్పష్టం చేశారు. జైల్లో అవినీతి నేతలు ఉండాలని బిల్లు పెడితే కాంగ్రెస్ నేతలు దాన్ని అడ్డుకొని బిల్లులు చించేశారని చెప్పుకొచ్చారు. తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రవేశపెడతామని చెప్పారు కానీ ఇప్పుడు చేయడం లేదన్నారు. కాంగ్రెస్ నేతలు ప్రజలను భ్రమలకు గురిచేస్తున్నారని మండిపడ్డారు.



నేటి ప్రభాత
# సూర్య
జాతీయ తెలుగు దిన పత్రిక
TGTEL/25/A0784
EDITORIAL ఎడిటోరియల్
శనివారం
23- 08- 2025
4



## కావేరీ-గోదావరి అనుసంధానం

**బనకచర్లపై చర్చ రాలేదన్న రాహుల్ బొజ్జా**

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :** గోదావరి- కావేరి నదుల అనుసంధానంపై ఎన్‌డబ్ల్యూడీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన సంప్రదింపుల భేటీ ముగిసింది. మరోమారు సమావేశం నిర్వహిస్తామని సీడబ్ల్యూసీ ఛైర్మన్ అతుల్ జైన్ వెల్లడించారు. నదుల అనుసంధానంపై రాష్ట్ర అభిప్రాయాలు వివరించినట్లు- తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా పేర్కొన్నారు. తెలంగాణ నుంచి వెళ్తున్న నీటిలో సగం అంటే.. 74 టీఎంసీలు కోరినట్లు- తెలిపారు. ఏపీ నాలుగు ఇంట్రా లింక్‌లను ప్రతిపాదించింది. తెలంగాణ సమ్మతి లేకుండా ఇంట్రా లింకులు ఆమోదించవద్దని కోరాం. బనకచర్ల లింక్ అంశం అంతగా చర్చకు రాలేదు. ఈ ప్రాజెక్టుపై రాష్ట్ర అభిప్రాయాలను గతంలోనే చెప్పామని రాహుల్ బొజ్జా వివరించారు.

# సంపాదకీయం

## ప్రసాజ్వామ్యంలో నిరంకుశం పనికిరాదు!

ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా భావించే భారతదేశంలో ఆరోగ్యకరమైన రాజకీయ వాతావరణం లేకుండా పోతోంది. అధికారం చేపట్టిన నేతలు నిరంకుశమనే విషసంస్కృతిని పెంచి పోషిస్తున్నారు. అన్ని వ్యవస్థలతో పాటు మీడియా పైనా నిరంకుశంగా వ్యవహరిస్తున్నారు. తాము కోరుకున్నది మీడియాలో రావాలన్న అహంకారంతో ఉన్నారు. లేకుంటే మాకు వ్యతిరేకంగా మీడియా కథనాలు రాస్తోందని అక్కసు వెళ్లగక్కుతున్నారు. అలాగే మీడియా సంస్థలపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారు. మీడియా ప్రతినిధులను దరిదాపుల్లోకి రాకుండా చూస్తున్నారు. సొంత మీడియాలను ప్రోత్సహిస్తూ..డబ్బా కొట్టుకుంటున్నారు. అహంకారం పతన హేతవు... ఇది అందరికీ తెలుసు.. కానీ మోడీ, మమతా బెనర్జీ, కెసిఆర్,జగన్ వీరంతా అహంకార పాలకులుగా నిలిచిపోతారనడంలో సందేహం లేదు. మోడీ దేశానికి ఏమీచేయలేదని.. మోడీ అహంకారపూరితంగా వ్యవహరిస్తున్నారని అధికారంలో ఉండగా కెసిఆర్ తరచూ మండిపడుతూ వచ్చారు. కానీ కెసిఆర్ అంతకు మించిన అహంకారి అని తెలంగాణలో ఎవరిని అడిగినా చెబుతారు. ఇప్పుడాయన కేవలం తను సృష్టించుకున్న ఏకాంతంలో గడుపుతున్నారు. ప్రజల్లో ఎక్కడా కానరావడం లేదు. ఆయన ఎవరినీ దరిచేరనీయరన్నది కూడా అంతే నిజం. అధికారంలో ఉండగా జనగ్ కూడా అదే తరహాలో ఐదేళ్లు అధికారం ఏలారు. జనాలను దూరంగా పెట్టారు.

నిజానికి ప్రజాస్వామ్యంలో అహంకారం, నిరంకుశం పనికిరాదు. మోడీ గురించి విమర్శలు చేస్తున్న ఇండియా కూటమి నేతలు తమగతాన్ని కూడా గుర్తు చేసుకుంటే మంచింది. తమవైపు కూడా జనం చూస్తారని గుర్తించాలి. ప్రజాస్వామ్యంలో ప్రజలే దేవుళ్లు..వారిచ్చే ఓటుతో నిరంకుశంగా కాకుండా.. ప్రజాస్వామ్య యుతంగా పాలన సాగించాలి. ఓట్లేసుకోవడం ఎలాగో తెలుసుకుని రాజ్యమేలుతున్న మన రాజకీయ నేతలు అధికారంలోకి రాగానే ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కేస్తున్నారు. ప్రజలను పురుగుల్లా చూస్తున్నారు. పోలీసులను తమ గుప్పిట్లో పెట్టుకుని పాలన చేస్తున్నారు. ప్రజల చెంతకు రావడం, వారి గురించి తెలుసుకోవడం అన్నది మరచి పోయారు. ఇలా జరుగుతుందని రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ మహాశయుడు ఆనాడు ఊహించి ఉండరు. లేకుంటే ఎక్కడో ఒక దగ్గర చెక్ పాయింట్ పెట్టేవారు. ప్రజలకు చేరువగా ఉండాల్సిన నేతలు ప్రస్తుతం గిరిగీసుకుని తమ బంగళాలు దాటి రావడం లేదు. ప్రజల సమస్యలు తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు.

దేశంలో మిగతా నేతల సంగతెలా ఉన్నా... మోడీ, కెసిఆర్, జగన్‌లు అహంకారంలో తారాస్థాయికి చేరుకున్నారు. నిరంకుశంలో హిట్లర్, మోస్సోలీలను మించారు. మోడీని ప్రశ్నించే ముందు ఈ విషయాలను తమకు తాముగా ప్రశ్నించుకుంటే బాగుండేది. ఇకపోతే తెలంగాణలో కెసిఆర్‌కు ముందు సిఎంలుగా పనిచేసిన వారెవరూ ఎవరు కూడా ఇంత నిరంకుశంగా లేరు. దివంగత ప్రజాయుద్ధనౌక గద్దర్, కోదండరామ్ తదితర తెలంగాణ ఉద్యమకారులను కూడా కెసిఆర్ దూరం పెట్టిన విషయాన్ని జనం చూశారు. ఉమ్మడి ఎపిలో చెన్నారెడ్డి లాంటి నేత కూడా ఇంత నిరంకుశంగా పాలించ లేదు. దివంగత వైఎస్ కూడా ఎప్పుడూ ప్రజల్లో ఉండేవారు. ఇప్పుడు విభజన తరవాత అటు కెసిఆర్, ఇటు జగన్ పాలనా పగ్గాలు చేపట్టాక నిరంకుశంగా వ్యవహరించడంతో పాటు ఎదుటి పార్టీలను, వ్యక్తులను గంజిలో ఈగ తీసినట్లుగా వ్యవహరించారు. రాష్ట్రాలను అప్పులకుప్పగా తయారు చేశారు. అందుకే జనం వారిని కూడా నిరంకుశంగానే దూరం పెట్టారు. ప్రజాసంక్షేమం పేరుతో డబ్బుల పందేరంతో ఖాజానాను ఊడ్చేస్తున్న నాయకులు ఎప్పటికైనా జవాబుదారీగా ఉండాల్సిందే. అధికారంలో ఉన్న వారు నిజంగా మంచి పనులు చేస్తే ప్రజలు వారిని దూరం పెట్టరు. ప్రజలు నానా అవస్థలు పడుతున్నా వాటిపై పట్టింపు లేకుండా పాలన సాగిస్తున్నారు.

ఇక బిజెపి విషయానికి వస్తే..అన్ని రాష్ట్రాల్లో పాగా వేయాలన్న సంకల్పం ఉంటే మంచిదే. అందుకు మంచి పనులు చేస్తే చాలు. ప్రజలకు ఉద్యోగ,ఉపాధి కల్పించి, జిఎస్టీ వాయింపులు లేకుండా చేసి, ధరలను అదుపులో పెట్టగలిగితే ప్రజలే నేరుగా వచ్చి ఓటేసి బిజెపిని అక్కున చేర్చుకుం టారు. అలా జరగడం లేదు కనుకనే హిమాచల్, కర్నాటకలో దెబ్బకొట్టారు. ఈ క్రమంలో మోడీ కూడా ఆత్మపరిశీలన చేసుకోవాలి. తమ పాలన అంతా బ్రహ్మాండంగా ఉందన్న అహంకారంలో ప్రధాని మోడీ ఉన్నారు. ఎంతో గొప్ప పాలన అందిస్తున్నామని చాటుకుంటున్నారు. త్వరలోనే రెండు రాష్ట్రాలలో జరుగ బోయే అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కోవాల్సి ఉంది. ఈ ఎన్నికలకు ముందు అయినా బిజెపిని ప్రజలకు చేరువ చేసేలా మోడీ ప్రజలకు చేరువ కావాలి. ప్రజాస్వా మ్యాన్ని, హక్కులను, న్యాయాన్ని ప్రభుత్వాన్ని, వ్యవస్థలను కాపాడుకోవాల్సి ఉంది. పాలకులు ఇది గమనించి తమపనితీరును మెరుగు పర్చుకుంటే మంచిది. అలాకాకుండా నాయకలు తమ అహంకాన్ని వీడక పోతే కాలగర్భంలో కలసిపోక తప్పదు. ప్రజలతో మంచి అనిపించుకునేలా నిర్ణయాలు తీసుకోవాలి. కేంద్రంలో అయినా రాష్ట్రాల్లో అయినా పాలకులు నిజాయితీగా సాగాలి. ప్రజలకు మేలు చేసే నిర్ణయాలు తీసుకోవాలి.

## గోదావరికి తగ్గిన వరద ఉధృతి

- భద్రాచలం వద్ద నెమ్మదించిన గోదావరి



**హైదరాబాద్, నేటి ప్రభాత సూర్య :** ఎగువన కురిసిన భారీ వర్షాలు, వస్తున్న వరదతో ఉగ్రరూపం దాల్చిన గోదావరి క్రమంగా తగ్గుముఖం పడుతోంది. గురువారం రాత్రి 8 గంటలకు భద్రాచలం వద్ద నీటిమట్టం 51.9 అడుగులు ఉండగా వరద ప్రవాహం 13.66 లక్షల క్యూసెక్కులుగా నమోదైంది. రాత్రి 11 గంటలకు నీటిమట్టం తగ్గుముఖం పట్టి 51.4 అడుగులకు చేరింది. బుధవారం అర్ధరాత్రి 12 గంటలకు 48.6 అడుగులు ఉండగా గురువారం తెల్లవారుజామున 3 గంటలకు 49.5 అడుగులకు పెరిగింది. ఉదయం 6 గంటలకు 50.3, 9 గంటలకు 50.9, మధ్యాహ్నం 12 గంటలకు 51.4, 3 గంటలకు 51.9 అడుగులకు చేరింది. 5 గంటల పాటు- అదేస్థాయిలో నిలకడగా కొనసాగింది. రాత్రి 9 గంటలకు 51.7, 10 గంటలకు 51.5, 11 గంటలకు 51.4 అడుగులకు తగ్గింది. శుక్రవారం తెల్లవారుజాముకల్లా ఈ ప్రవాహం మరింత తగ్గినట్లుగా అధికారులు అంచనా వేస్తున్నారు. వివిధ ప్రాజెక్టులకు వరద ప్రవాహం కొనసాగుతోంది. గురువారం దుమ్ముగూడెం (సీతమ్మసాగర్)కు 13.23 లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరింది. సమ్మక్క సాగర్ (తుపాకులగూడెం) బ్యారేజీకి 8.26 లక్షలు, మేడిగడ్డకు 7.40 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఎ÷-లో రాగా.. వచ్చింది వచ్చినట్లే దిగువకు వదిలిపెట్టారు. గోదావరి ఉధృతితో తెలంగాణ-ఏపీ సరిహద్దులోని అల్లూరి జిల్లా యటపాక మండలం రాయనిపేట వద్ద జాతీయ రహదారిపై వరద నీరు వచ్చి చేరింది. ముందు జాగ్రత్తగా వాహనాల రాకపోకలను నిలిపివేశారు. భద్రాచలం-చర్ల మార్గంలో కూడా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గోదావరి ఉగ్రరూపంతో ఏపీలోని ఏలూరు జిల్లా వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో 29 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ రెండు మండలాల్లో లోతట్టు- ప్రాంతాలు, రహదారులపైకి వరద చేరుకోవడంతో బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. శబరి నది ఉధృతి కారణంగా వేలేరుపాడు మండలంలోకి వరద అంతకంతకు పెరుగుతూనే ఉంది. భద్రాచలం నుంచి దిగువకు 13.60 లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుండటంతో వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని గ్రామాలను వరద చుట్టుముట్టింది.

# పార్లమెంట్ ఆవరణలోకి వ్యక్తి చొరబాటు



- భద్రతా సిబ్బంది కళ్లుగప్పి గోడదూకిన ఆగంతకుడు
- వెంటనే సిబ్బంది అప్రమత్తం
- అదుపులోకి ఆగంతకుడు
- మరోసారి భద్రతా వైఫల్యం బట్టబయలు

**న్యూఢిల్లీ,నేటి ప్రభాత సూర్య :** పార్లమెంట్‌లోని భద్రతా సిబ్బంది వైఫల్యం మరోసారి బహిర్గతమైంది. ఓ ఆగంతకుడు గోడ దూకి పార్లమెంట్ భవనంలోకి చొరబడ్డాడు. భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమై.. అతడిని అదుపులోకి తీసుకుంది. శుక్రవారం ఉదయం ఒక వ్యక్తి రైలు భవనం వైపునున్న చెట్టు ఎక్కి.. కొత్త పార్లమెంట్ భవనంలోని గరుడ గేట్ వద్ద కిందకి దూకి పార్లమెంట్ భవనంలోకి ప్రవేశించాడు. ఈ విషయాన్ని అక్కడే ఉన్న భద్రతా సిబ్బంది చూసి.. అతడిని వెంటనే అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని పార్లమెంట్ భద్రతా సిబ్బంది కార్యాలయానికి తరలించి.. విచారిస్తున్నారు. పార్లమెంట్ వర్షా కాల సమావేశాలు ముగిసిన ఒక రోజు తర్వాత ఈ సంఘటన చోటు చేసుకోవడం గమనార్హం. ఈ సమావేశాలు ఆగస్టు 21వ తేదీన ముగిసిన సంగతి తెలిసిందే. గత ఏడాది సైతం ఈ తరహా ఘటన చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. 20 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి పార్లమెంట్ గోడ దూకి అనెక్స్ భవనం ఆవరణలోకి ప్రవేశించాడు. షార్ట్స్, టీ షర్ట్ ధరించిన ఆ యువకుడిని సీఐ ఎస్ఎఫ్ సిబ్బంది పట్టుకున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయిన సంగతి తెలిసిందే. అతడు ఉత్తరప్రదేశ్‌కు చెందిన మనీష్‌గా గుర్తించారు. అతడి వద్ద ఎటువంటి ఆయుధాలు లభ్యం కాలేదు. అయితే అతడి మానసిక పరిస్థితి సరిగ్గా లేదని పోలీసులు తెలిపారు. ఇక రెండేళ్ల క్రితం పార్లమెంట్ శీతాకాల సమావేశాలు జరుగుతున్న వేళ.. లోక్‌సభలో పబ్లిక్ గ్యాలరీలో కూర్చొన్న ఇద్దరు యువకులు ఆ తర్వాత సభలో దూకి సభ్యులను భయభ్రాంతులకు గురి చేశారు. రంగుల పొగను వదిలి అందరినీ భయభ్రాంతులకు గురిచేశారు. అదే సమయంలో పార్లమెంట్ వెలుపల కూడా ఇద్దరు వ్యక్తులు ఇదేరకమైన నిరసనను చేపట్టారు. ఈ ఘటన తర్వాత పార్లమెంట్‌లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఈ ఘటన పార్లమెంట్‌లోని భద్రతా వైఫల్యాన్ని బయటపెట్టింది. అనంతరం పార్లమెంట్ భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. 2001, డిసెంబర్ 13వ తేదీ పార్లమెంట్‌పై ఉగ్రవాదులు దాడికి యత్నించారు. ఈ అంశంపై చర్చ జరుగుతున్న రోజే.. ఈ ఆగంతకులు సభలోకి ప్రవేశించి గందరగోళం సృష్టించడం గమనార్హం. గతేడాది ఆగస్టులో కూడా ఈతరహా ఉల్లంఘన చోటు చేసుకుంది. ఓ యువకుడు పార్లమెంట్ గోడ దూకి లోపలికి చొరబడేందుకు యత్నించాడు. నిందితుడిని ఉత్తరప్రదేశ్‌కు చెందిన మనీశ్‌గా పోలీసులు గుర్తించారు. అప్పుడు నిందితుడి వద్ద ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదు. అతడి మానసిక పరిస్థితి సరిగా లేదని అప్పట్లో పోలీసులు వెల్లడించారు.

# డికెకు సిఎం పదవి దక్కేనా?

## నివురుగప్పిన నిప్పలా అసంతృప్తి.. అంతుచిక్కని కాంగ్రెస్ తీరు



బెంగళూరు, నేటి ప్రభాత సూర్య : కర్ణాటకలో 'సీఎం మార్పు' అంశంపై పార్టీలో అంతర్గత కలహాలు కొనసాగుతున్నాయి. డికె శివకుమార్ నివురుగప్పిన నిప్పులా తన కోరికణను అణచివేసుకుని పైకి సౌమ్యుడిలా కనిపిస్తున్నారు. తను పోరాటం చేసి అధికారంలోకి తీసుకుని వస్తే సిఎం పీఠం దక్కడం లేదన్న బాధలో కుమిలిపోతున్నారు. మరోవైపు ఐదేళ్లు తనే సిఎంనని సిద్దరామయ్య భీష్మించుకున్నారు. ఐదేళ్లూ తానే ముఖ్యమంత్రినని ఓవైపు సిద్ధరామయ్య నొక్కి చెబుతున్నా.. అటు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్.. తన చేతుల్లో ఏమీ లేదంటూనే 'ఆశ పడటంలో తప్పులేదు కదా' అనే సంకేతాలిస్తున్నారు. అయితే సీఎం మార్పునకు పార్టీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో శివకుమార్ అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. తాను కూడా ఎప్పటికైనా ముఖ్యమంత్రి పదవిని స్వీకరిస్తానని పలు మార్లు బహిరంగంగానే చెప్పిన డీకే.. తన వ్యాఖ్యల ద్వారా ఆ పీఠంపై తనకున్న ఆశను వెలిబుచ్చుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో తాజాగా డీకే వ్యవహరించిన తీరు చర్చనీయాంశంగా మారింది. ఇటీవల జరిగిన కర్ణాటక అసెంబ్లీ సమావేశంలో శివకుమార్ తన రాజకీయ జీవితం గురించి మాట్లాడుతూ.. ఆరెస్సెస్‌తో తనకున్న సంబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆరెస్సెస్ గీతమైన 'నమస్తే సదా వత్సలే'ను ఆయన పాడడంతో భాజపా నాయకులంతా చిరునవ్వులు చిందిస్తూ, బల్లలపై చప్పట్లు చరుస్తూ.. నినాదాలు చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో అసెంబ్లీలో శివకుమార్ ప్రవర్తనపై నెట్టింట మరోమారు చర్చ మొదలైంది. తనకు సీఎం పీఠం ఇవ్వకపోతే భాజపాలో చేరే అవకాశం ఉందని కాంగ్రెస్ పార్టీని, సిద్ధరామయ్యను బెదిరించేందుకే ఆయన ఈవిధంగా చేసి ఉంటారని పలువురు నెటిజన్లు చర్చించు కుంటున్నారు. ఇటీవల స్వాతంత్య్ర వేడుకల్లో ప్రధాని మోదీ ఆరెస్సెస్‌ను ప్రశంసించడాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే తప్పుపట్టిన నేపథ్యంలో శివకుమార్ పరోక్షంగా ఆయనకు పార్టీ మార్పు గురించి హెచ్చరికలు చేసి ఉంటారని మరికొందరు భావిస్తున్నారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి పదవిపై రాష్ట్ర కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చ జరిగింది. సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌లు రెండున్నరేళ్లపాటు పదవిలో కొనసాగేలా ఓ అంగీకారానికి వచ్చారన్న వార్తలూ వచ్చాయి. పలు కేసుల్లో సిద్ధరామయ్య పేరు బయటకు రావడంతో సీఎంగా ఆయనను తొలగించాలన్న డిమాండ్లు తెరపైకి వస్తున్నాయి.

# ఢిల్లీలో నకిలీ సిబిఐ అధికారుల హల్‌చల్

- రూ.2.5 కోట్లు దోచుకున్న ముఠా
- ఓ మహిళ సహా ఇద్దరి అరెస్ట్

**న్యూఢిల్లీ- నేటి ప్రభాత సూర్య :** దేశ రాజధాని ఢిల్లీలో నకిలీ సీబీఐ అధికారుల చేతివాటం కలకలం సృష్టించింది. సీబీఐ అధికారులుగా నటిస్తూ ఒక ముఠా ఏకంగా రూ. 2.5 కోట్లు దోచుకుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. దర్యాప్తులో భాగంగా కేసుతో సంబంధం ఉన్న ఒక మహిళతో సహా ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.కోటికి పైగా నగదును స్వాధీనం చేసుకున్నట్లు- పోలీసులు తెలిపారు. ఈ ఘటన తూర్పు ఢిల్లీలోని వివేక్ విహార్ ప్రాంతంలో వెలుగుచూసింది. ఘజియాబాద్లోని ఇందిరాపురం సమీపంలో నివస్తున్న వ్యాపారస్థుడు మన్మైత్‌ను పలువురు నకిలీ సీబీఐ అధికారులు టార్గెట్ చేసి అతని కార్యాలయంలో నుంచి దాదాపు రూ. 2.5 కోట్ల దోచుకెళ్లారు. ఆగస్టు 19న మన్మైత్ తన స్నేహితుడు రవిశంకర్‌ను తన ఆఫీస్ నుంచి రూ. 1.10 కోట్లు- తన ఇంటికి తీసుకురావాలని చెప్పాడు. దీంతో రవిశంకర్ నగదు బ్యాగుతో బయటకు రాగానే, నలుగురు వ్యక్తులు రెండు కార్లలో వచ్చారు. వారిలో ఒక మహిళ కూడా ఉంది. వచ్చిన వాళ్లు తమను తాము సీబీఐ అధికారులమని పరిచయం చేసుకొని రవిశంకర్‌పై దాడి చేసి, డబ్బు బ్యాగును లాక్కున్నారు. తర్వాత ఆయను బలవంతంగా ఆఫీసు లోపలికి తీసుకెళ్లి, అక్కడ ఉన్న మన్రోత్ ఉద్యోగి దీపక్ మహేశ్వరిని కొట్టారు. అనంతరం వారు ఆఫీసులో ఉంచిన మిగిలిన నగదును కూడా తమతో తీసుకెళ్లారు. ఈక్రమంలో ముఠా సభ్యులు వారిద్దరిని కూడా వారితో బందీలుగా తీసుకెళ్లారు. అనంతరం చింతామణి అండర్పాస్ దగ్గర రవిశంకర్‌ను, నిగంబోధ్ ఘాట్ దగ్గర మహేశ్వరిని వదిలి వెళ్లారు. విషయం తెలుసుకొని మన్మైత్ వివేక్ విహార్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు- తెలిపారు. డీసీపీ ప్రశాంత్ గౌతమ్ మాట్లాడుతూ.. సంఘటన స్థలం, చుట్టు-పక్కల ప్రాంతంలోని సీసీటీ-వీ ఫుటేజ్‌లను పరిశీలించగా, నిందితులు వాడిన వాహనాలు ఢిల్లీలోని సాకేత్లో ఉన్న ఒక ఎన్జీఓ పేరుతో అద్దెకు తీసుకున్నట్లు- తేలిందన్నారు. ఈక్రమంలో ఫరీదాబాద్ నుంచి ఇద్దరు అనుమానితులను అరెస్టు చేశామన్నారు. వారిలో ఒకరు



అస్సాంకు చెందిన పపోరి బారువా (31) అనే మహిళ కాగా, మరొకరు తుగ్లకాబాద్‌కు చెందిన దీపక్(32)గా గుర్తించినట్లు- తెలిపారు. ఈ మహిళ ఒక ఎన్జీఓకు కార్యదర్శిగా పని చేస్తుందని, నిందితుల నుంచి రూ. 1.08 కోట్లు- స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మిగిలిన వారిని కూడా గుర్తించామని, అతి త్వరలో వారిని కూడా అరెస్టు చేస్తామన్నారు.

## ఎన్డీఏలో ఉంటూ ఇతరులకు ఎలా మద్దతు ఇస్తాం

**రాధాకృష్ణన్‌ను కలిసి అభినందించిన చంద్రబాబు**

**న్యూఢిల్లీ- నేటి ప్రభాత సూర్య :** దేశం గౌరవించదగిన వ్యక్తి ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ అని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. దిల్లీలో శుక్రవారం సీఎం ఆయన్ను కలిసి అభినందించారు. అనంతరం మీడియాతో చంద్రబాబు మాట్లాడారు. ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు సీపీ రాధాకృష్ణన్‌ను ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక చేశాయి. ఆయనకు మా మద్దతు ఉంటుందని చెబుతూ అభినందనలు తెలిపాను. దేశానికి, ఉపరాష్ట్రపతి పదవికి సీపీ రాధాకృష్ణన్ గౌరవం తీసుకొస్తారు. ఎన్నికల ముందు నుంచి ఎన్డీయేలో తెదేపా ఉంది. ఆ అభ్యర్థికే మా మద్దతు ఉంటుంది. తెలుగువాడు అన్నప్పుడు గెలిచే అవకాశం ఉంటేనే అభ్యర్థిని పెట్టాలి. గెలిచే అవకాశం లేకపోయినా అభ్యర్థిని పెట్టి ఇండియా కూటమి రాజకీయం చేస్తోంది. ఎన్డీయేలో ఉన్నప్పుడు ప్రతిపక్ష అభ్యర్థికి ఎలా మద్దతు ఇస్తాం?అని చంద్రబాబు అన్నారు.



కూటమికి కట్టుబడి వెళతామని అన్నారు. ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్‌ను గెలిపిస్తామని అన్నారు. చంద్రబాబు వెంట తెలుగు పార్టీకి చెందిన మంత్రులు, ఎంపిలు ఉన్నారు.

## ఘనంగా వరలక్ష్మీ వ్రతం





మందమర్రి, మంచిర్యాల జిల్లా:నేటి ప్రభాత సూర్య:ఆగష్టు. 22::
శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా మందమర్రి బురదగూడెంలోని త్రిశక్తి అష్టలక్ష్మి, కామాఖ్య దేవి మరియు మహంకాళి దేవాలయాల్లో మహిళలు సమూహంగా వరలక్ష్మీ వ్రతంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ పూజారి సతీష్ భవాని మాట్లాడుతూ, సౌభాగ్య వృద్ధి, ఆయురారోగ్యాల కోసం మహిళలు కుంకుమార్చనతో పాటు వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా ఆచరించారని తెలిపారు. ఈ వ్రతం ఆచరించడం ద్వారా సకల అష్ట ఐశ్వర్యాలు, ఆరోగ్యం, శాంతి లభిస్తాయని ఆయన చెప్పారు. ఈ మహోత్సవంలో సుమారు వెయ్యి మంది మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.

## బ్లడ్ బ్యాంక్‌లో ఆకస్మిక తనిఖీ



మంచిర్యాల, ఆగస్టు 22:నేటి ప్రభాత సూర్య..
మంచిర్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీష్ రాజ్ గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. 2008లో ప్రారంభమైన ఈ బ్లడ్ బ్యాంక్ ద్వారా సికిల్ సెల్, తలసీమియా రోగులు, గర్భిణులు, కౌమార బాలికలు, డెంగ్యూ బాధితులకు ఉచితంగా రక్తం అందజేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అంతేకాకుండా అరుదైన రక్త గ్రూపులు కూడా అవసరమైన వారికి ఉచితంగా అందుబాటులో ఉన్నాయని బ్లడ్ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ భాస్కర్ రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ హరీష్ రాజ్ మాట్లాడుతూ, రక్తదానం చేసిన ప్రతి డోనర్ వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. రక్త నిల్వలు సరిపడా ఉండేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైనప్పుడు ఒక్కొక్కరికీ తక్షణమే రక్తం అందేలా చూడాలని ఆదేశించారు.
తనిఖీ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అప్పల ప్రసాద్, మాధవీలత, వైద్య సిబ్బంది బుక్క వెంకటేశ్వర్, జిల్లా మాస్ మీడియా అధికారి పాల్గొన్నారు.

## నాటిన మొక్కలను పరిరక్షించాలి



నేటి ప్రభాత సూర్య / నిర్మల్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 22
సారంగాపూర్:ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి వాటిని పరిరక్షించాలని అడెల్లి ఆలయ ఛైర్మెన్ సింగం భోజ గౌడ్,జడ్పీ ఫోరం అధ్యక్షులు పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు భోల్లోజి నర్సయ్య లు అన్నారు శుక్రవారం మండలంలోని అడెల్లి శ్రీ మహా పోచమ్మ దేవస్థానం ఆవరణలో పనుల జాతర సందర్భముగా ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు, ఉపాధి హామీ కూలి జంగం పోసవ్వ, గ్రామపంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్ మురళిలను ఆలయ చైర్మెన్ సింగం భోజగౌడ్,మాజీ జడ్పీ పోరం జిల్లా అధ్యక్షులు రాజేశ్వర్ రెడ్డిలు సన్మానం చేశారు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు భోల్లోజి నర్సయ్య, ఆలయ ధర్మకర్త ప్రభాకర్ గౌడ్, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్, సీనియర్ మెట్టు,ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎయిర్ ఫోర్స్ జవాన్ మృతి.. స్వగ్రామంలో విషాద ఛాయలు





నేటి ప్రభాత సూర్య / నిర్మల్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 22

ముధోల్ మండలంలోని తరోడ గ్రామానికి చెందిన ఇండియన్ ఎయిర్ ఫోర్స్ జవాన్ లక్ష్మి ఈశ్వర్ ప్రసాద్(25) అనే యువకుడు ప్రమాదవశాత్తు ఆగ్రా దగ్గరలో ఉన్న దమ్మ వాటర్ఫాల్ లో పడి మృతి చెందారు. దీంతో జవాన్ స్వగ్రామమైన తరోడ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎయిర్ ఫోర్స్ జవాన్ గా పనిచేస్తూ, సెలవుల్లో స్వగ్రామానికి వచ్చినప్పుడు అందరితో కలుపుకోలుగా ఉండేవాడు. ఒకేసారి పిడుగు లాంటి వార్త వినిపించడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు, స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు. తల్లిదండ్రులు ఆరుకాలం వ్యవసాయం చేసుకుంటూ పిల్లలను చదివించారు. అయితే ఇంటికి పెద్ద దిక్కు అయినా పెద్ద కుమారుడు లక్ష్మి ఈశ్వరప్రసాద్ మృతి చెందడంతో తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. పిల్లల చదువు కోసం నిరంతరం వ్యవసాయ చేనులో కూరగాయల సాగులో ఆదర్శ రైతుగా తల్లిదండ్రులు సిలారం విజయలక్ష్మి, గంగాధర్ నిలిచారు. ఇప్పటికే కూతురు ఇండిగో ఎయిర్లైన్స్‌లో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. చిన్న కుమారుడు చదువుకుంటున్నాడు. అయితే పెద్ద కుమారుడైన ఈశ్వర్ ప్రసాద్ ఎయిర్ ఫోర్స్ జవాన్‌గా పనిచేస్తు, తాజాగా రెండు రోజుల క్రితం ఈశ్వర్ ప్రసాద్ ప్రమాదవశాత్తు జలపాతం లో పడి మృతి చెందటంతో కుటుంబ సభ్యులు రోదనలు కంటతడి పెట్టిస్తున్నాయి. మృతదేహం విమానంలో హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ కు శుక్రవారం రాత్రి వరకు రావచ్చని కుటుంబ సభ్యులు తెలిపారు.

## తవ్వకాల్లో బయటపడ్డ దుర్గామాత విగ్రహం .. భక్తుల ఆనందం




మంచిర్యాల జిల్లా.నేటిప్రభాతసూర్య.ఆగష్టు. 22:
రామకృష్ణాపూర్ ఆర్‌కే-1 ఏరియాలో అరుదైన సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు చేపట్టిన తవ్వకాల సమయంలో పుట్టలో నుంచి దుర్గామాత విగ్రహం వెలుగులోకి వచ్చింది. ఈ సమాచారం వ్యాప్తి చెందగానే గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో అక్కడికి తరలివచ్చారు. స్థానికుల మాటల ప్రకారం, కొంత మంది భక్తులకు అమ్మవారు కలలో దర్శనమిచ్చి, తాను ఈ ప్రాంతంలో వెలసినట్లు తెలియజేశారని తెలిపారు. అనంతరం తవ్వకాలు జరిపినప్పుడు నిజంగానే దుర్గామాత విగ్రహం బయటపడటం భక్తులలో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపింది. విగ్రహం బయట పడిన విషయం తెలిసిన వెంటనే భక్తులు పూలు, కొబ్బరికాయలు సమర్పిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ ప్రాంతమంతా భక్తి శ్రద్ధలతో నిండిపోయింది. స్థానిక పెద్దలు, భక్తులు కలిసి విగ్రహాన్ని మరొక సదుపాయమున్న ప్రదేశంలో ప్రతిష్టించాలనే నిర్ణయం తీసుకున్నారు. ఈ ఘటనతో ఆర్‌కే-1 ఏరియాలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. విగ్రహం ప్రతిష్ఠ అనంతరం ప్రత్యేక ఉత్సవాలు, పూజలు నిర్వహించేందుకు గ్రామస్థులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

### సూపరిండెంట్ ఆకుల శ్రీనివాస్



మంచిర్యాల జిల్లా. నేటి ప్రభాత సూర్య. ఆగష్టు. 22:లక్షేటిపేట:
సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని లక్షేటిపేట ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ ఆకుల శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం ఆసుపత్రి ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, వైరల్ ఫీవర్ వంటి వ్యాధులు వేగంగా వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నందున ప్రతి ఒక్కరూ ముందు జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ప్రజలు బయటకు వెళ్లే సమయంలో మాస్కులు తప్పని సరిగా ధరించాలని, ఇంటి చుట్టుపక్కల చెత్త, నిల్వ నీరు లేకుండా పరిశుభ్రత పాటించాలని ఆయన సూచించారు. "మలిన జలాలు, చెత్త కుప్పలు దోమల పెంపకానికి కారణమవుతాయి. వాటి నివారణే సీజనల్ వ్యాధుల నియంత్రణకు మొదటి అడుగు" అని తెలిపారు. అదేవిధంగా లక్షేటిపేట ప్రభుత్వాసుపత్రిలో ఆపరేషన్ థియేటర్, గైనకాలజిస్ట్ సేవలు, అన్ని విభాగాల నిపుణ వైద్యులు అందుబాటులో ఉన్నారని, ప్రజలు ఎలాంటి సందేహం లేకుండా ఆసుపత్రిని ఆశ్రయించాలని సూపరిండెంట్ ఆకుల శ్రీనివాస్ తెలిపారు. ప్రజల ఆరోగ్యం కాపాడడంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారని ఆయన భరోసా ఇచ్చారు.

## బెల్లంపల్లిలో బ్రహ్మ కుమారీస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం





మంచిర్యాల జిల్లా :నేటి ప్రభాత సూర్య. ఆగష్టు. 22:
బెల్లంపల్లిలో శుక్రవారం రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో బ్రహ్మ కుమారీస్ ఈశ్వరయ్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ సాయి మనోజ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ రక్తదాన శిబిరం, రాజయోగా ఆధ్యాత్మిక గురువుగా పేరుపొందిన దాది ప్రకాష్ మణిజీ 18వ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా లక్ష యూనిట్ల రక్తాన్ని సేకరించే జాతీయ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేయబడింది. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ సాయి మనోజ్ మాట్లాడుతూ, "రక్తదానం ప్రాణదానం. నేను స్వయంగా గతంలో రక్తదానం ద్వారా లబ్ధి పొందాను. రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయలేం. ఒకరి నుండి మరొకరికి మాత్రమే రక్తం చేరుతుంది. అందుకే ప్రతి ఒక్కరూ రక్తదాన ప్రాముఖ్యతను తెలుసుకొని ముందుకు రావాలి" అని పిలుపునిచ్చారు. అలాగే రక్తదానంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించుకోవాలని ఆయన సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు సామాజిక స్ఫూర్తిని పెంచుతాయని, మరింత మంది యువత రక్తదానంలో పాల్గొనాలని ఆయన అభిలషించారు.
ఈ శిబిరంలో స్థానిక ప్రజలు, యువకులు, స్త్రీ పురుషులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. నిర్వాహకులు దాదీ ప్రకాష్ మణిజీ జయంతిని పురస్కరించుకొని ప్రజలకు సేవ చేయడం ఆనందంగా ఉందని తెలిపారు.

## గ్రామాల అభివృద్ధే కేంద్ర ప్రభుత్వ ధ్యేయం: శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్

నేటి ప్రభాత సూర్య నిర్మల్ జిల్లా ప్రతినిధి / అగస్ట్ 22






గ్రామాల అభివృద్ధి కేంద్ర ప్రభుత్వ ధ్యేయమని ముధోల్ శాసనసభ్యులు రామారావు పటేల్ అన్నారు. ముధోల్ మండల కేంద్రంలోని నిర్వహించిన పనుల జాతర కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయడం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అంకితభావంతో ప్రజలను భాగస్వామ్యం చేయడం ఈ కార్యక్రమం లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో నిరుపేద కూలీ కుటుంబాల జీవనోపాధిని మెరుగుపరచడం, ఒక ఆర్థిక సంవత్సరంలో కనీసం 100 రోజుల కూలీ పని దినాలను కల్పించడం ఉపాధి హామీ పథకం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముధోల్ మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్, డ్రైన్ శంకుస్థాపన చేశారు. ముధోల్ నుండి రువ్వి గ్రామానికి వెళ్లే రోడ్డు ప్రయాణికులకు , రైతులకు రవాణా సౌకర్యార్థం 9 లక్షల నిధులతో గ్రావెల్ రోడ్డు పనుల ప్రారంభించిన అనంతరం తాసిల్దార్ కార్యాలయం నందు మూడు లక్షల నిధులతో పబ్లిక్ టాయిలెట్స్ భవన నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. మహాత్మ జ్యోతిబాపూలే చౌరస్తా నుండి హెచ్ పి పెట్రోల్ బాంక్ వరకు సుమారుగా 1.5 కిలోమీటర్ వరకు మరమ్మత్తుల పనులను ప్రారంభించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా ముందుకెళ్తారని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలు సైతం తమ సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు సాయి శక్తుల కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులు, నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు



మంచిర్యాలజిల్లా. నేటి ప్రభాత సూర్య: ఆగష్టు 22:
'మార్వాడి గో బ్యాక్' బంద్ నేపథ్యంలో మంచిర్యాల పట్టణ బీజేపీ అధ్యక్షుడు అమిరిశెట్టి రాజుతో పాటు పలువురు బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. పట్టణంలో ఉద్రిక్తతలు తలెత్తకుండా జాగ్రత్త చర్యలలో భాగంగా ఈ అరెస్టులు చేపట్టినట్లు సమాచారం. ఈ సందర్భంగా అమిరిశెట్టి రాజు మాట్లాడుతూ, "ఓయూ జేఏసీ ముసుగులో కాంగ్రెస్, బీఆర్ఎస్, కమ్యూనిస్టులు తలపెట్టిన బంద్ చట్టవిరుద్ధమైనది. బంద్కు పిలుపునిచ్చిన వారిపై కాకుండా బీజేపీ నాయకులపై చర్యలు తీసుకోవడం సరైంది కాదు" అని విమర్శించారు.
బీజేపీ నాయకులు మాట్లాడుతూ, పోలీసులు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ తమను అన్యాయంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు స్పష్టం చేశారు. మంచిర్యాల పట్టణంలో పరిస్థితిని అదుపులో ఉంచేందుకు పోలీసులు అప్రమత్తంగా ఉన్నారు.

## విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ చేసిన సిరి ఫౌండేషన్



మంచిర్యాల జిల్లా,నేటి ప్రభాత సూర్య.ఆగస్టు 22:
బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామపంచాయతీ పరిధిలోని కరిశల గట్టం గ్రామంలో గల ఎంపిపిఎస్ పాఠశాలలో సిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యాసామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిరి ఫౌండేషన్ ఫౌండర్ కుశనపల్లి మనోహర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు తమ వంతు సహాయం అందించాలనే ఉద్దేశంతో పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్, బ్యాగులు పంపిణీ చేశామని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ముఖ్యంగా సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండి చదువుపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు.

## ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం



నేటి ప్రబాత సూర్య / నిర్మల్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 22
భైంసా : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ తాసిఫ్ ఆధ్వర్యంలో భైంసా మండలంలోని వాలేగాంలో వైద్య శిభిరం లో 69 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ తాసిఫ్ మాట్లాడుతూ ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగహన కల్పించి, వ్యక్తి గత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పై కూడా అవగహన కల్పించారు. ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉంటే పల్లె దవాఖానాలకు వచ్చి పరీక్షలు చేహించుకోవాలని గ్రామ ప్రజలకు తెలియజేశారు. వైద్య శిబిరములలో అసంక్రిమిత వ్యాధులు అనగా బిపి- షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సీఎచ్ఓ వంశీ, డాక్టర్ ఎచ్ఇఓ అబ్దుల్ సలీమ్, డాక్టర్ ఎచ్.ఎ(సీ) విజయ్ కుమార్, ఏఎన్ఎం లక్ష్మి,మంజుల గ్రామ కార్యదర్శి పోతన్న, స్వయం సహకార సీసీ లక్ష్మణ్,గ్రామ సమైక్య విఓఎ లక్ష్మి, మాజీ ఎంపీటీసీ మాణిక్ రావు, ప్రజలు తదితరులు ఉన్నారు.

## తెలంగాణ అమరిక తెలుగు సంఘం ఆధ్వర్యంలో ట్రై సైకిళ్ల పంపిణీ

**ముఖ్య అతిథిగా పాల్గొన్న తోటకూర వజ్రేష్ యాదవ్**






**నేటి ప్రభాత సూర్య: మేడిపల్లి: (ఆగస్టు 22 శుక్రవారం)**
పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సంఘం హోటల్ ఆవరణంలో తెలంగాణ అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో వికలాంగులకు ట్రై సైకిల్లు, చేతి కర్రల పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మేడ్చల్ నియోజకవర్గ ఇన్చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి పీర్జాదిగూడ మాజీ మేయర్ అమర్ సింగ్, బోడుప్పల్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి, పిర్జాదిగూడ మాజీ కోఆప్షన్ సభ్యులు జగదీశ్వర్ రెడ్డి మేడిపల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చిలుముల అజయ్ కుమార్ రెడ్డి పాల్గొని వికలాంగులకు ట్రై సైకిల్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనేక సేమా సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న తెలంగాణ అమెరికా తెలుగు సంఘం నిర్వాహకులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో టిటిఏ ప్రతినిధులు పలువురు కాంగ్రెస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల సరఫరా బాధ్యత కేంద్రానిదే

**- కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు, మార్కెట్ డైరెక్టర్ గులాం అక్బర్**

**- కేంద్ర మంత్రులు బాధ్యత వహించాలి**

**- రైతుల అభివృద్ధి కోసం కృషి**

**యాచారం నేటి ప్రభాత సూర్య ( ఆగస్టు 22):**



తెలంగాణ రాష్ట్రానికి అవసరమైన ఎరువులు సరఫరా చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వాన్ని దేనని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు, మార్కెట్ డైరెక్టర్ గులాం అక్బర్ అన్నారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతుల ప్రభుత్వమని తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునని చెప్పారు. నిరంతరం రైతుల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. యూరియా సరఫరా కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నిసార్లు మొరపెట్టుకున్న నరేంద్ర మోడీకి చీమ కుట్టినట్లుగా లేదని ఆయన విమర్శించారు. కేంద్ర మంత్రులు బండి సంజయ్, గంగాపురం కిషన్ రెడ్డి ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. కేంద్ర మంత్రులది రాష్ట్రంలో మాటలు తప్ప. రాష్ట్రానికి, కేంద్రం నుండి ఏం తెస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులకు అవసరానికి ఉన్న 60 శాతం కేంద్రం నుండి వచ్చినవి. యూరియా కొరత వల్ల కొంత రైతులు ఇబ్బంది పడుతున్నది వాస్తవమేనని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు న్యాయం జరిగేలా ప్రయత్నం చేస్తుందని తెలిపారు.

## అన్నీ బంధాలకన్నా స్నేహ బంధం గొప్పది



**ఇబ్రహీంపట్నం- నేటి ప్రభాత సూర్య, జోన్ ఇంచార్జ్ (ఆగస్టు 22)**
తమతో పాటు చదువుకుని అకాలమరణం చెందిన కొలనుగూడ గ్రామానికి చెందిన ఆదర్ల మారేష్ ఖన్నాకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిన్నతుండ్ల 1992 -93 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు రూ. 31000 ఇచ్చి తమ స్నేహబంధాన్ని చాటుకున్నారు. చిన్నతుండ్ల ఉన్నత పాఠశాలలో చదువుకున్న మారేష్ ఖన్నా ఇటీవల ఎలిమినేడు కొలనుగూడ మార్గమధ్యలో ద్విచక్ర వాహనం ప్రమాదంలో మరణించడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న క్లాస్మేట్స్ అందరు కలిసి కుటుంబాన్ని ఆదుకోవాలని 31000 రూపాయలను మారేష్ ఖన్నా కుటుంబానికి దశదినఖర్మ రోజున అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లాస్మేట్స్ మస్కు జంగయ్య, పెద్దతుండ్ల మాజీ సర్పంచ్ చిలుకల యాదగిరి, మాజీ ఉప సర్పంచ్ బాసాని రాజి రెడ్డి, కప్పపహాడ్ మాజీ ఎంపీటీసీ చేతాళ్ళ జంగయ్య, దయ్యాల గణేష్, కండక్టర్ జక్కుల సత్యనారాయణ, మారేపల్లి యాదగిరి, పుప్పాల బాలరాజు తదితరులు పాల్గొని స్నేహబంధాన్ని చాటుకున్నారు.

## పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పనుల జాతర



**ఇబ్రహీంపట్నం -నేటి ప్రభాత సూర్య, జోన్ ఇంచార్జ్**
పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ పనుల జాతర కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో వెంకటమ్మ ఇబ్రహీంపట్నం, ముక్కునూరు, రాయపోలు గ్రామాలలో పాల్గొనడం జరిగింది. ముక్కునూరు గ్రామంలో గ్రామ సభలో పాల్గొని బాగా పనిచేసిన ఉపాధ్యాయుని, కూలీలను సన్మానించడం జరిగింది. అనంతరం ఉపాధి హామీ నిధులతో నిర్మించుకున్న పశువుల షెడ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో బి తిరుపతాచారి, పంచాయతీ కార్యదర్శి రాజకుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ లింగస్వామి పాల్గొన్నారు. ఇంకా పశువుల షెడ్డు కావలసినవారు పండ్లతోటలు పెట్టుకునేవాళ్లు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో గ్రామ సభలో సూచించడం జరిగింది. అదేవిధంగా గ్రామంలో డ్రైనేజ్ చివరన కమ్యూనిటీ ఇంకుడు గుంతలు పనులు కూడా జరుగుతున్నట్లు గ్రామ ప్రజలకు తెలియజేసారు.

తరువాత రాయపోలు గ్రామంలో పనుల జాతర లో పాల్గొని మొక్కలు నాటి పనులు ప్రారంభించారు. ఇబ్రహీంపట్నం మండలంలో 14 గ్రామాలలో పనుల జాతర కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటమ్మ, ఏపీవో తిరుపతి చారి, సాంకేతిక నాయకులు శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ యాదగిరి పాల్గొనడం జరిగినది.

## హాస్టల్ నుండి తప్పిపోయిన విద్యార్థి

**- యాచారం పెట్రోల్ పోలీసులకు దొరికిన విద్యార్థి**

**-మాదాపూర్ కు చెందిన విద్యార్థి**

**-తల్లిదండ్రులకు అప్పగింత**




**యాచారం నేటి ప్రభాత సూర్య ( ఆగస్టు 22):**
గురుకుల హాస్టల్ లో ఉంటూ తప్పిపోయిన విద్యార్థి యాచారం పెట్రోలింగ్ పోలీసులు దగ్గరికి తీసుకొని విచారించారు. శుక్రవారం ఉదయం 9:30కు పెట్రోల్ మొబైల్ పోలీసులు విధులు నిర్వహిస్తుండగా ఓ పది సంవత్సరాల బాలుడిని యాచారం బస్సు స్టాప్ వద్ద గుర్తించి యాచారం పోలీస్ స్టేషన్ కార్యాలయానికి తీసుకొచ్చారు. అనంతరం ఆ బాలుడు ని వివరాలను అడిగి తెలుసుకున్నారు. రంగారెడ్డి జిల్లా, కందుకూరు మండలం, మాదాపూర్ గ్రామానికి చెందిన శ్రీను కుమారుడుగా మని చరణ్ గా సమాధానం ఇచ్చాడని చెప్పారు. తను గురుకుల హాస్టల్ లో చదువుకుంటున్నానని అక్కడనుండి ఎవరికి చెప్పకుండా ఎవరి అనుమతులు లేకుండా బయటకు వచ్చానని సమాధానం ఇచ్చినట్లుగా పేర్కొన్నారు. వెంటనే ఆ పాలుడు తల్లిదండ్రులకు సమాచారం అందజేసి క్షేమంగా యాచారం పోలీసులు అప్పజెప్పారు. హాస్టల్ విద్యార్థులను తప్పిపోకుండా చూడవలసిన బాధ్యత హాస్టల్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయుల బాధ్యత వహించాలని యాచారం సీఐ నందీశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఉయ్యాల మధు, సత్యనారాయణ, పెట్రోలింగ్ కానిస్టేబులు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ చతుర్థి ఉత్సవాల ఏర్పాట్ల పై సమావేశం





**రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్- నేటి ప్రభాత సూర్య :**
గణేష్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో, ఎలాంటి
అవాంఛనీయ సంఘటనలు జరగకుండ ఘనంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనము సమావేశ మందిరంలో గణేష్ చతుర్థి ఉత్సవాల ఏర్పాట్ల పై డిసిపిలు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనరులు, పోలీస్ అధికారులు, గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు, సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 27న వినాయకచవితి ఉత్సవాలు ప్రారంభమై సెప్టెంబర్ 6న నిమజ్జనం చేయనున్నందున, వినాయక మండపాలు ఏర్పాటు చేసే భక్తులు, నిర్వాహకులు భక్తి శ్రద్దలతో సురక్షిత వాతావరణంలో పండుగ జరుపు కోవాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి మండపాల నిర్వాహకులు తగు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. జిల్లాలో గణేష్ నిమజ్జనం నిర్వహించేందుకు 44 చెరువులను గుర్తించినట్లు తెలిపారు. గణేష్ శోభాయాత్ర నిర్వహించే దారిలో గుంతలు పడిన రహదారులు, ప్యాచ్ వర్క్ రిపేర్
పనులు, గణేష్ నిమజ్జనం నిర్వహించే ప్రదేశాల వద్ద క్రెన్లు, బారికేడింగ్, వేదిక ఏర్పాట్లు మున్సిపల్, ఆర్ అండ్ బి శాఖ అధికారులు కలసి చేపట్టాలని, అధికారులు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా ప్రణాళిక రూపొందించుకొని సమన్వయముతో పని చేయాలని సూచించారు. ముఖ్యంగా విద్యుత్ అంతరాయం కలగకుండా నిరంతరం విద్యుత్ సరఫరా కొనసాగించాలని, సమస్యలు ఎక్కువగా ఉన్నచోట భారీ బందోబస్తూ కల్పించాలని, సిసి కెమెరాలు ఏర్పాట్లు చేయాలని, భారీ కేడింగ్, బందోబస్త్, మెడికల్, సానిటేషన్, కంట్రోలింగ్ రూం తదితర ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలి పారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి శశిధర్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో పని చేసేలా, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండ ఏర్పాట్లు చేపట్టేలా అధికారులకు సూచనలు చేయాలని కలెక్టర్ ను కోరడం జరిగినది. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, మహేశ్వరం డిసిపి సునితా రెడ్డి, ఎల్బీనగర్ డిసిపి ప్రవీణ్ కుమార్, శంషాబాద్ అడిషనల్ డిసిపి కె. రామ్ కుమార్, మాదాపూర్ అడిషనల్ డిసిపి సాయిరామ్, ఆర్డీఓలు అనంత రెడ్డి, చంద్రకళ, సరిత, జగదీశ్వర్ రెడ్డి, మున్సిపల్ కమీషనరులు, పోలీస్ అధికారులు, ఆర్ అండ్ బి అధికారులు, గణేష్ ఉత్సవ సమితి సభ్యులు, సంబంధితఅధికారులు, పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సర్వే నిర్వహించాలి






**రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్- నేటి ప్రభాత సూర్య :**
ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టడంతో పాటు సోమవారం నుండి ఇంటింటికి జ్వరాల సర్వేను నిర్వహించాలనిజిల్లాకలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు.
శుక్రవారం కలెక్టరేట్ లోని సమావేశం మందిరంలో, జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి పారిశుద్ధ్యం వనమహోత్సవం, త్రాగునీటి వసతి ఇందిరమ్మ ఇళ్లు పై ఎంపీడీవోలు మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆశా వర్కర్లు, ఏఎన్ఎమ్ లు ఇంటింటికి తిరిగి జ్వరాల సర్వే చేపట్టాలని అన్నారు. వైద్య అధికారులు, సిబ్బంది సమన్వయం చేసుకుంటూ ప్రజల ఆరోగ్యాలతో ముడిపడి ఉన్న శానిటేషన్ నిర్వహణలో నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వహించాలని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి, గ్రామాలలో, మున్సిపల్ పరిధిలో పారిశుద్ధ్యం పనులు, సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండడానికి చర్యలు చేపట్టాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఉండడానికి ఆయిల్ బాల్స్ ను వాటర్ నిలిచి ఉన్నచోట వేయాలన్నారు. ట్యాంకులలో నిల్వ ఉన్న నీటి మొత్తాన్ని పారవేయాలి అన్నారు. ఓ.హెచ్.యస్.ఆర్ ట్యాంకులను ఎప్పటి కప్పుడు బ్లీచింగ్, క్లోరినేషన్‌తో శుభ్రం చేసి కొత్త నీటిని నింపాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు ప్రతిరోజు ఫాగింగ్ చేయించాలని అన్నారు. వర్షానికి డ్రైనేజీలలో చెత్తాచెదారం పేరుకు పోకుండా శుభ్రం చేయించాలన్నారు. వర్షం నీరు నిలువ ఉంచకుండా ముందుకు ప్రవహించేలా డ్రైన్లను శుభ్రం చేయాలన్నారు. త్రాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా మిషన్ భగీరథ అధికారులు గ్రామాల్లో పర్యటించి పైప్ లైన్ లీకేజీలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. వన మహోత్సవం పై సమీక్షిస్తూ జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం సాధించేందుకు శాఖల వారీగా లక్ష్యాలను ఈ నెల 31వ తేది లోపు ప్లాంటేషన్ పూర్తి చేయాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ జి ఎఫ్ రాష్ట్ర స్థాయి క్రీడలను 33 జిల్లాల వారీగా నిర్వహించాలి

- **ఎస్ జి ఎఫ్ పెండింగ్ లో ఉన్న నిధులను విడుదల చేయాలి**
- **ఎక్కువమంది విద్యార్థులకు అవకాశం కల్పించాలి**
- **ఎస్ జి ఎఫ్ సెక్రెటరీ ఉషారాన్ని కలిసిన పిడి పీఈటి నాయకులు**



**యాచారం నేటి ప్రభాత సూర్య (ఆగస్టు 22):**
ఎస్ జి ఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలను, ఉమ్మడి జిల్లాల వారీగా కాకుండా 33 జిల్లాల వారీగా క్రీడలు నిర్వహించాలని పీడీపీటీల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ సాబెర్ అన్నారు. శుక్రవారం ఎస్ జి ఎఫ్ సెక్రెటరి ఉషారాణికి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చంతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడలను అభివృద్ధి చేయాలని కోరారు. ఎక్కువమంది విద్యార్థులను రాష్ట్రస్థాయిలో అవకాశం కల్పించాలని ఉషారాణికి వివరించారు. పెండింగ్లో ఉన్న నిధులను వెంటనే విడుదల అయ్యేలా చూడాలని ఆమెను కోరారు. ఈ కార్యక్రమంలో పి ఈ టి రంగారెడ్డి జిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ రామచంద్రుడు, పి ఆర్ టి యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నాకర్, శ్రీనివాస్, వివేక్ పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం

**- ఎమ్మెల్యే సహకారంతో మంచాల మండలానికి 15 చెక్కులు**

**- కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి**



**మంచాల- నేటి ప్రభాత సూర్య (ఆగస్టు 22)**
సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం వంటిదని దానిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో మంచాల మండలంలోని ఆరుట్ల, లోయపల్లి, జాపాల, తాళ్లపల్లి గూడ, చిత్తాపూర్ తదితర గ్రామాలకు చెందిన 15 మంది లబ్దిదారులకు రూ 5,91,000 ల విలువైన చెక్కులను ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అనంగల్ల యాదయ్య, జిలమోని సత్తయ్య, ఎండి సలాం, కావలి శ్రీనివాస్, రావుల గుడిమల్ల చంద్రయ్య, మార సురేష్, అంతటి రాజు గౌడ్, మాధగోని జంగయ్య గౌడ్, ఓరుగంటి లింగమయ్య గౌడ్, దండేటికార్ మహేందర్, మాధగోని శివశంకర్, వింజమూరు యాదగిరి రెడ్డి, రావుల భాషయ్య, సోప్పరి దశరథ, దాసరమోని రమేష్, జిలమోని పాండు, యశమోని శేఖర్ ,కాస గణేష్, పంబాల బుగ్గరాములు, చెరుకు నర్సింహా, బుట్టి కృష్ణ, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు వెదిరే సికిందర్ రెడ్డి, మాణిపాటి వెంకటేష్, బుట్టి జంగయ్య, బీరుమల్లేష్, ఆడెపు మధు, రావుల నాగరాజు, సింగారం సుమన్, మంతని పరమేష్ ,మేగవత్ లక్ష్మా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్ల ప్రారంభం .. పనుల జాతర 2025లో భాగంగా కొత్త సౌకర్యాలు



**షాబాద్ :నేటి ప్రభాత సూర్య ఆగస్టు 22**
చేవెళ్ల నియోజకవర్గంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న "పనుల జాతర 2025" ప్రారంభమైంది ఉదయం నుంచి వివిధ గ్రామాల్లో పనులు ప్రారంభోత్సవం మరియు కొత్తగా చేపట్టే పనుల భూమి పూజ కార్యక్రమంలో చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య గారు మరియు జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి గారు ఉదయం నుంచి ప్రజలు జిల్లా అధికారుల ఆధ్వర్యంలో ప్రారంభమైన జాతరలో వివిధ గ్రామాలను సందర్శించడం జరిగింది. షాబాద్ మండలంలో పనుల జాతర 2025 భాగంగా నూతనంగా ఆస్పల్లి గూడ గ్రామం లో కొత్త సీసీ రోడ్లను స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య గారు ప్రారంభించారు .ఈ సందర్భంగా 'కాలే యాదయ్య' మాట్లాడుతూ... ప్రజల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుంది రుణమాఫీ రైతుబంధు రైతు భరోసా మహిళలకు ఆర్థిక సహాయం నిరుద్యోగ భృతి వంటి పథకాలు నేరుగా లబ్దిదారులకు చేరుతున్నాయి ఈ పనులు జాతర ద్వారా ఈ పథకాలపై అవగాహన కల్పించడం అని తెలిపారు.
జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి గారు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుంది ప్రత్యేకంగా స్వయం ఉపాధి పనులకు మద్దతిస్తూ ప్రతి గ్రామానికి ఆర్థిక బలం కల్పిస్తుంది. రాష్ట్రంలోని ప్రజలందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తూ ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అమలు చేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పి.సి.సి మెంబర్ షాబాద్ దర్శన్ గారు. గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ గారు, పి.ఎ.సి.ఎస్ చైర్మన్ ప్రతాపరెడ్డి గారు ,చేవెళ్ల మార్కెట్ చైర్మన్ పెంటయ్య గౌడ్ గారు, నియోజకవర్గ నాయకులు మాజీ ఎంపిటిసిలు, మాజీ సర్పంచులు, సంబంధిత అధికారులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## ఇల్లు కూలి వ్యక్తి మృతి





**చింతపల్లి- నేటి ప్రభాత సూర్య (ఆగస్టు 22)**

ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు కూలి వ్యక్తి మృతి చెందిన సంఘటన చింతపల్లి మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చింతపల్లి మండలం తిరుమలపురం గ్రామానికి చెందిన గార్లపాటి రాములు తండ్రి మైసయ్య 82 కూలి చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. 22వ తేదీ తెల్లవారుజామున స్లాబ్ కూలి ఇంట్లోనే మరణించడం జరిగిందని మృతుని మనుమడు గార్లపాటి ప్రవీణ్ కుమార్ తెలిపారు. పెద్ద శబ్దం వినపడగానే వెళ్లి చూసామని ఇల్లు కూలిపోయి ఉందని తెలుసుకొని జెసిబి తీసుకొచ్చి స్లాబ్ ను తొలగించగా మా తాత మంచం పైన మరణించి ఉన్నాడని,మా తాతకు చుట్ట తాగే అలవాటు ఉంది కనుక ప్రమాదవశాత్తు రాత్రిపూట సిలిండర్ పేలుంటుందని ఆయన తెలిపారు. మా తాత మరణం పై ఎటువంటి అనుమానం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. పంచనామ నిర్వహించిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నామని చింతపల్లి ఎస్సై ముత్యాల రామ్మూర్తి తెలిపారు.

## కేశంపేటలో గణేశ్ పండుగ ఏర్పాట్లపై శాంతి సమన్వయ సమావేశం

**షాద్ నగర్ నేటి ప్రభాత సూర్య జోన్ ఇంచార్జ్ (ఆగస్టు 22):**




కేశంపేట్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో గణేశ్ పండుగ సందర్భంగా మండల్ నిర్వాహకులు మరియు కమ్యూనిటీ పెద్దలతో శాంతి, సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేశంపేట సీఐ నరహరి, ఏఈ సాయి, ఎమ్మార్వో అజం అలీ, ఎంపీడీవో , ఎంపీ ఓ కిష్టయ్య, పోలీస్ ఎస్ఐ రాజ్‌కుమార్ పాల్గొని, పండుగలు శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు సూచనలు అందించారు. భద్రతా ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా సి సి కెమెరాల ఏర్పాటు, రోడ్లను దిగ్బంధించకుండా ట్రాఫిక్ సజావుగా కొనసాగించటం, అనుమతించదగిన డెసిబెల్స్‌లోనే ధ్వనిని ఉపయోగించడం (డీజే వినియోగం నిషేధం), శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించడం, క్రమశిక్షణను పాటిస్తూ స్వచ్ఛంద సేవకుల వ్యవస్థను ఏర్పాటు చేయడం, వర్షాకాలంలో విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు, ఫైర్ సేఫ్టీపై ప్రత్యేక శ్రద్ధ వంటి సూచనలు అధికారులచే ఇవ్వబడ్డాయి. గతంలో చోటుచేసుకున్న లోపాలపై నిర్వాహకుల నుండి అభిప్రాయాలు సేకరించగా, ఈసారి మరింత సమన్వయంతో పండుగ నిర్వహణకు హామీ ఇచ్చారు. సమావేశంలో సుమారు 110 మంది నిర్వాహకులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొని, కేశంపేట పోలీసులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఉద్యాన పంటల సాగుతో రైతులకు అధిక లాభాలు

**ఉద్యాన శాఖ ఫీల్డ్ ఆఫీసర్ వంశీ**



**చింతపల్లి-నేటి ప్రభాత సూర్య (ఆగస్టు 22)**

తక్కువ కాలంలో ఎక్కువ ఆదాయాన్ని అందించే ఉద్యాన పంటలను రైతులు సాగు చేసి అధిక దిగుబడులు సాధించవచ్చునని ఉద్యానవన శాఖ ఫీల్డ్ ఆఫీసర్ వంశీ పేర్కొన్నారు. శుక్రవారం చింతపల్లి మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ వద్ద రైతులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంత తక్కువ కాలంలో అధిక ఆదాయాన్ని అందించే పండ్లు కూరగాయలు, ఇతర పంటలు పామాయిల్ లాంటి పంటలు రైతులు సాగు చేసుకున్నట్లయితే కేంద్ర,,రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆర్థికంగా అభివృద్ధిపరిచేందుకు పెద్ద ఎత్తున సబ్సిడీ పై సహాయ సహకారాలు అందించేందుకు ప్రోత్సహిస్తుందని వారు రైతులకు సూచించారు. 20 25 - 26 సంవత్సరానికి గాను వార్షిక రాష్ట్ర ప్రణాళికలు ప్రభుత్వం ఖరారు చేసిందన్నారు. ఆయిల్ ఫామ్ ఇస్తాన పథకం, సమగ్ర ఉద్యాన అభివృద్ధి పథకం, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన సూక్ష్మ నీటిపారుదల పథకం లాంటివి ప్రభుత్వం చేపట్టిందన్నారు. కావలసిన రైతులు ప్రభుత్వం అందించే ఉద్యాన వ్యవసాయ పథకాలకు వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలన్నారు. రైతులు ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకోని ఉద్యాన పంటల సాగు కోసం ముగ్గు చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ ఏఈఓ నరసింహ్మా, ఫీల్డ్ ఆఫీసర్ పేర్ల మల్లేష్, మాజీ ఉపసర్పంచ్ నక్క మోని పరమేష్, రైతులు కృష్ణారెడ్డి,ముత్యాలు, అనంతుల పెద్ద మల్లేష్ గౌడ్,జంగయ్య అనంతుల చిన్న మల్లేష్ గౌడ్, రైతులుతదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఆన్లైన్ గేమ్ బెట్టింగ్ నిషేధం హర్షణీయం

**ఇబ్రహీంపట్నం- నేటి ప్రభాత సూర్య జోన్ ఇంచార్జ్**




ఆన్లైన్ గేమ్, బెట్టింగ్ ఆప్ లను నిషేధించడాన్ని నిన్న పార్లమెంట్లో చట్టం చేయడం హర్షనీయం. బి ఆర్ ఆర్ ఫౌండేషన్ బూడిద రామ్ రెడ్డి ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాల వేయడం జరిగింది. దీనికి సంబంధించి చట్టాన్ని బిల్లును పార్లమెంట్లోకి తీసుకురావడంలో కానీ పార్లమెంట్లో ప్రవేశపెట్టడం గానీ పార్లమెంట్లో చట్టంగా రూపొందించినందుకు బిల్లుకు ఆమోదం తెలిపిన పార్లమెంటు సభ్యులందరికీ ప్రతి ఒక్కరికి పేరుపేరునా పాదాభివందనాలు హృదయపూర్వక నమస్కారాలు.

ఇప్పుడు ముఖ్యంగా దేశంలో యువత యువతని కాకుండా మహిళలు యువత యువకులు విద్యార్థులు అన్ని వర్గాల వారు కూడా ఈ ఆన్లైన్కి ఆడుతూ ఆన్లైన్ బెట్టింగ్ లాడుతూ లక్షల కోట్లను పోగొట్టుకుని సంసారం నాశనం చేసుకుని చాలా మంది మరియు ప్రాణం మీదికి తెచ్చుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటనలు ఉన్నాయి చాలా వరకు ఇది సమాజం నాశనం చేస్తుంది.కాబట్టి ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కొంచెం ఆలస్యమైనా ఇంత మంచి ఆలోచన మంచి నిర్ణయం చేసి పార్లమెంట్లో చట్టం తేవడం ద్వారా దేశ ప్రజలను రక్షించినందుకు ప్రతి ఒక్కరు కూడా ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. మరి ఇవే కాకుండా సమాజంలో ఇంకా కొన్ని చెడు వ్యసనాలు డ్రగ్స్, గంజాయి ఇలాంటివన్నీ చట్టాలు చేయడం కాదు చట్టాలను కూడా కచ్చితంగా 100 శాతం అమలు అయ్యి యువతను సమాజాన్ని రక్షిస్తారని చెప్పి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేస్తున్నాము.

ఇట్లాంటి మంచి కార్యక్రమాలకు ఏ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏ పార్టీ కేంద్రంలో రాష్ట్రంలో ఉన్న మేము ఇట్లాంటి కార్యక్రమాలకు మా వంతు మద్దతుగా మేము సహకరిస్తామని చెప్పి ఈ సందర్భంగా తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బూడిద నరసింహ్మారెడ్డి, భగీరథ సాగర్, మడుపు గోపాల్, దండే నరసింహ్మా యాదవ్, మంగ ఐలేష్, పో రెడ్డి సురేందర్ రెడ్డి, గౌరిగి రమేష్, చంటి, సామల శ్రీనివాస్ రెడ్డి, భీమ అర్జున్ రెడ్డి, ఓరు గంటి నరసింహ్మా గౌడ్, అమీర్, గుడ్డేటి శేఖర్ యాదవ్, ఆర్మీ మోహన్, బోడుసు వెంకటేష్ యాదవ్, వట్టిపెల్లి రాంరెడ్డి, ఎల్లాపెల్లి మల్లేష్,శ్రీనివాస్, బత్తుల వెంకటేష్, నల్లోల బుగ్గ రాములు,వినయ్, బుట్టి మహేందర్, శ్రీకాంత్,మంత్రి శ్రీనివాస్, మేటిల వినయ్, మడుపు వివేకానంద, ఓరుగంటి రాజు పాల్గొన్నారు.

## మార్వాడి హటావో.. తెలంగాణ బచావో..

- గో బ్యాక్ మార్వాడి అంటూ ర్యాలీ
- స్వచ్ఛందంగా బంద్‌ను కొనసాగుతున్న వ్యాపారులు

**ఇబ్రహీంపట్నం- నేటి ప్రభాత సూర్య జోన్ ఇంచార్జ్, (ఆగస్టు 22)**



మార్వాడి వ్యాపారులకు వ్యతిరేకంగా శుక్రవారం ఉదయం పలు వ్యాపారస్తులు ఇబ్రహీంపట్నం కేంద్రం లో ఇందిరాల రమేష్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, మడుపు వేణుగోపాల్ రావు ఆధ్వర్యంలో సాగర్ హైవే, మంచాల రోడ్డు, పాత బస్టాండ్ రోడ్డు లో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీని మార్వాడి హటావో తెలంగాణ బచ్చావో, గో బ్యాక్ మార్వాడి.. సేవ్ తెలంగాణ అంటూ.. నినాదాలతో ర్యాలీని నిర్వహించారు. అదేవిధంగా ర్యాలీతో వచ్చి ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోగల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నార్త్ ఇం డియా నుంచి ఇక్కడకు వచ్చి తమకు ఉపాధి లేకుండా చేస్తున్నారని, గోమాత సంరక్షణ పేరిట గోపేడా గోమూత్రం నెయ్యి పాల వ్యాపారం చేస్తూ ఉన్నారు, ఇక్కడ ఉన్న స్థానిక ప్రజలను మోసం చేస్తున్నారని, స్థానికంగా ఉన్న గుడిలలో కూడా బ్రాహ్మణులను అక్కడి నుంచి తీసుకొచ్చి ఇక్కడ పూజలు చేయిస్తున్నారని, హిందూ మతం పేరుతో ఇక్కడ వ్యాపారం చేస్తూ ఇక్కడున్న స్థానికులను వ్యాపారం చేయిం చడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే మార్వాడీలు అన్ని వ్యాపారాలకు విస్తారిస్తున్నారని, వాళ్ల మనుషులకే ఉద్యోగాలు ఇస్తున్నారని, ప్రజలకు నాసిరకం వస్తువులు అమ్ముతున్నారని పేర్కొన్నారు. మార్వాడి లకు వ్యతిరేకంగా బంద్ కు మద్దతుగా ఇబ్రహీంపట్నం లోని వ్యాపారులైన కిరాణా, వస్త్ర,వర్తక,స్వర్ణకార, విశ్వబ్రాహ్మణ, ఇతర వ్యాపా రస్తులు స్వచ్ఛందంగా బంద్ లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కొండ్రు రఘుపతి, భరత్ జగన్, ఆమదాల యాదగిరి, బండి మహేష్, ఆబేద్, షబ్బీర్,వర్తక సంఘం అధ్యక్షుడు కిరణప్ప, మొబైల్ సంఘం నాయకులు సాగర్ యాదగిరి, విశ్వకర్మ సంఘం సభ్యులు శ్రీనివాస్, విక్రమ్ చారి, వీరాచారి, హాస్టల్ అసోసియే నాయకులు శ్రీనివాస్, రవి, రామకృష్ణ, మహేష్ గౌడ సంఘం నాయకులు శివకుమార్, వేణుగోపాల్ గౌడ్,శ్రావణ్ కుమార్, వెంకటేష్,ఆర్యవైశ్య సంఘం నాయకులు బెల్లం పాండు గుప్త తో పాటు ఇంపారడైజ్ వస్త్ర వ్యాపారుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఉపయోగకరమైన పనులు చేపట్టాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్
అధికారులకు ఆదేశాలు

**నేటి ప్రభాత సూర్య/ నిర్మల్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 22**



జాతీయ ఉపాధి హామీ పథకం ఈజీఎస్ కింద రైతులకు కూలీలకు ఉపయోగకరమైన పనులను చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు శుక్రవారం నిర్మల్ గ్రామీణ మండల డ్యాంగాపూర్ లో నిర్వహించిన పనుల జాతర కార్యక్రమంలో భాగంగా ఈజీఎస్ నిధులతో నిర్మించిన పశువుల పాకను లబ్ధిదారులతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు అనంతరం ఏర్పాటు చేసిన కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పనుల్లో రైతులకు ఉపయోగపడే గొర్రెలు పశువుల పాకాలు పౌల్ట్రీ పొలం బాటలు వంటి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు

ప్రతి గ్రామ పంచాయతీ స్థాయిలో ప్రజలకు ఉపాధి హామీ పనులపై అవగాహన కల్పించాలని ఆదేశించారు జిల్లాలో 100% అక్షరసత్య సాధించేందుకు ప్రభుత్వ ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు ప్రతి ఒక్కరికి చదవడం రాయడం వచ్చేటట్లు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు విద్యాశాఖ ఆధ్వర్యంలో వాలంటీర్లను నియమించి అక్షరాస్యతాను పెంపొందించేందుకు చర్యలు కొనసాగుతాయని వెల్లడించారు అనంతరం 100 రోజులు ఈజీఎస్ పనులు పూర్తి చేసిన కూలీలను ఈ సందర్భంగా కలెక్టర్ సన్మించారు ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీఓ రత్నా కళ్యాణి, ఎంపీడీవో గజానన్, అధికారులు ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

## గణేష్ నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభం




- భైంసా పట్టణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు
- హిందు ఉత్సవ సమితి హారతి కార్యక్రమంలో భాగస్వామ్యం
- యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచన
- గణేష్ మండప నిర్వాహకుల సత్కారం

**నేటి ప్రభాత సూర్య / నిర్మల్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 22**

భైంసా పట్టణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని గుజరిగల్లీ, సుభాష్ నగర్, ఎన్. బి. నగర్, గోకుల్ నగర్ వంటి ప్రాంతాల్లో గణేష్ మండపాలను ఏర్పాటు చేసి భక్తులు స్వామివారిని పూజిస్తున్నారు. శుక్రవారం రాత్రి జరిగిన హారతి కార్యక్రమంలో హిందు ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు. హిందు ఉత్సవ సమితి అధ్యక్షులు పెండెపు కాశినాథ్ మాట్లాడుతూ, పూర్వీకుల ఆచారాలు, సంప్రదాయాలకు అనుగుణంగా పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు.అదే విధంగా, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా గణేష్ మండప నిర్వాహకులు హిందు ఉత్సవ సమితి సభ్యులను షాలువాతో సత్కరించి, స్వామివారి ప్రసాదం అందజేశారు.

## ఘనంగా పొలాల అమావాస్య పండుగ



**నేటి ప్రభాత సూర్య / నిర్మల్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 22**

నియోజకవర్గ కేంద్రమైన ముధోల్ తో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో శుక్రవారం పొలాల అమావాస్య పండుగను ఘనంగా నిర్వహించారు. ఆరుగాలంరైతన్నలుకు నేస్తాలు అయిన బసవన్నలను శుభ్రం గా కడికి అందంగా ముస్తాబు చేశారు. డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి హనుమాన్ ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. అనంతరం బసవన్నలకు పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. ఎడ్లు లేని రైతులు మట్టి ఎడ్ల ప్రతిమలకు పూజలు చేశారు. ఆనంతరం ప్రతి ఇంట్లో పిండి వంటలతో పాటు వివిధ రకాల వంటకాలతో భోజనం కార్యక్రమం నిర్వహించారు.

## జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రత్యేక అధికారి వీరబ్రహ్మయ్య**



**కరీంనగర్ (గన్నేరువరం)- నేటి ప్రభాత సూర్య:**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని గునుకుల కొండాపూర్ ప్రత్యేక అధికారి వీరబ్రహ్మయ్య అన్నారు. శుక్రవారం గ్రామంలో ఉపాధి హామీ పథకం పనుల జాతర 2025 సంవత్సరం ను పురస్కరించుకొని గ్రామానికి చెందిన కొరివి రాజయ్య పశువుల పాకను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో ఉన్న స్కీం లను రైతులు తెలుసుకొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ నేలపట్ల కనకయ్య, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాళ్లపల్లి రవికుమార్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి పీ రాజేష్, క్షేత్ర సహాయకులు హనుమాన్ల యాదగిరి, కారోబార్ ముల్కల అంజయ్య, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## మానసా దేవి ఆలయంలో చివరి శ్రావణ శుక్రవారం సందడి





**కరీంనగర్ (గన్నేరువరం)- నేటి ప్రభాత సూర్య:**

శ్రావణ మాసం ఆఖరు శుక్రవారాన్ని పురస్కరించుకుని కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలంలోని ఖాసింపేట్ మానసా దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయం మహిళలతో సందడిగా మారింది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు గంటలపాటు క్యూలైన్లో బారులు తీరారు. ఆఖరు శుక్రవారంను పురష్కరిం చుకుని వివిధ ప్రాంతాల నుంచి మానసా దేవి ఆలయానికి భక్తులు పోటేత్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుం డా ఉండేందుకు ఆలయ కమిటీ చైర్మన్ చంద్రారెడ్డి ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## దేన్యతండాలో పనుల జాతర ప్రారంభం



**చింతపల్లి -నేటి ప్రభాత సూర్య (ఆగస్టు 22)**
మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రారంభోత్సవం లో భాగంగా శుక్రవారం ప్రభుత్వం ప్రారంభిస్తున్న పనుల జాతర కార్యక్రమంలో భాగంగా దేన్య తండా గ్రామపంచాయతీలో గుంతల పనులను ప్రారంభించిన ఏపీవో శౌరి రెడ్డి. కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ చంద్రశేఖర్, దేన్య తండా గ్రామ శాఖ అధ్యక్షుడు రామావత్ శ్రీనివాస్ నాయక్, మాల్ వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ రమావత్ హనుమాన్ నాయక్, రామావత్ బగ్గు నాయక్,రామావత్ పంతు నాయక్, చంద్రయ్య, రామావత్ మోత్య నాయక్ ,రామావత్ సుందర్, రాజు ముఖ్యులు పాల్గొన్నారు.

## మంచిర్యాలలో పనుల జాతర సందడి



**- అభివృద్ధి పట్ల కాంగ్రెస్ కట్టుబాటు స్పష్టం**



**మంచిర్యాల జిల్లా:నేటి ప్రభాత సూర్య. ఆగష్టు. 22:**
మంచిర్యాల జిల్లాలో పనుల జాతర ఉత్సాహంగా కొనసాగుతోంది. అభివృద్ధి పనుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న కట్టుబాటును మరోసారి ప్రజలకు అర్థమయ్యేలా, రాష్ట్ర కార్మిక మరియు గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి గారు జిల్లా కలెక్టర్ శ్రీ కుమార్ దీపక్ గారితో కలిసి పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు.భీమారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో అంగన్వాడి భవన నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. గ్రామ చిన్నారుల భవిష్యత్తు దృష్ట్యా విద్య, పోషణ, ఆరోగ్యం అన్నీ ఒకే చోట లభించేలా అంగన్వాడి కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి గారు వెల్లడించారు.ఇదే కార్యక్రమంలో గ్రామానికి చెందిన ఒక నిరుపేద కుటుంబం ఇందిరమ్మ ఇల్లు కోసం విజ్ఞప్తి చేయగా, మంత్రి వెంటనే స్పందించి అక్కడే ఉన్న అధికారులను ఆ కుటుంబానికి త్వరితగతిన ఇల్లు మంజూరు చేయాలని ఆదేశించారు. “కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షాన నిలబడి, ప్రతి అర్హుడికి గృహం కల్పించడమే లక్ష్యం. ఇదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సంకల్పం” అని మంత్రి వివేక్ స్పష్టం చేశారు.తరువాత జైపూర్ మండలంలో నిర్వహించిన పనుల జాతరలో పాల్గొని పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. రహదారులు, పాఠశాలలు, కమ్యూనిటీ హాల్స్, ఇండ్ల నిర్మాణం వంటి పనులు సమానంగా సాగుతున్నాయని ఆయన వివరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి వివేక్ గారు, “కాంగ్రెస్ ప్రభుత్వం మాట ఇస్తే తప్పక నెరవేరుస్తుంది. రైతు పక్షపాతిగా, పేదల కోసం ఇందిరమ్మ ఇళ్లు, యువత కోసం ఉద్యోగాలు %-% ఇవన్నీ కాంగ్రెస్ పాలనలోనే సాధ్యం. ప్రతి గ్రామం వెలుగుతో, ప్రతి కుటుంబం సంతోషంతో నిండిపోవడమే మా లక్ష్యం” అని అన్నారు.ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని ఉత్సాహాన్ని నింపారు.


## గౌడన్నలకు ఇచ్చిన హామీలను అమలు పరచాలని డిమాండ్

**ధర్నాలో పాల్గొన్న అనంతరాజు గౌడ్.**



**హైదరాబాద్ -నేటి ప్రభాత సూర్య (ఆగస్టు 22)**
కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు గౌడ్ లకు ఇచ్చిన హామీ ప్రకారం వైన్స్, బార్ అండ్ రెస్టారెంట్లలో 25శాతం రిసర్వేషన్లు అమలు పరచాలని గౌడ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం హైద్రాబాద్ లోని గన్ పార్క్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమానికి మాజీ మంత్రివి.శ్రీనివాస్ గౌడ్ తో కలిసి ధర్నాలో పాల్గొన్న మర్రిగూడ మాజీ ఎంపీపీ బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు అనంత రాజు గౌడ్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో అమలు కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి. ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిందన్నారు. హైద్రాబాద్ లో కల్లుపై కుట్ర చేసి కల్లును బంద్ చేయడం సిగ్గు చేటని. తెలంగాణలో 2సంవత్సరాలలో తాటి, ఈత చెట్లపై నుండి ప్రమాదానికి గురై, సుమారుగా 1145మంది గీత కార్మికులు చనిపోయారని తెలిపారు. తక్షణమే వారి కుటుంబాలకు ఇచ్చిన హామీ ప్రకారం ఒక్కొక కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని, హైద్రాబాద్ లో మూసివేసిన కల్లు దుకాణాలను వెంటనే తెరవాలని, జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైన్ షాపులలో బిఆర్ఎస్ ప్రభుత్వంలో గౌడ్ లకు 15శాతం ఇస్తే, కాంగ్రెస్ పార్టీ 25 శాతం ఇస్తామని హామీ ఇచ్చి నేడు 25 శాతం హామీని అమలు చేయకుండా, 15శాతంను అమలు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. వెంటనే ఇచ్చిన హామీ ప్రకారం సవరించి గౌడ్ లకు వైన్స్ లలో 25శాతం కోటాను కేటాయించి. గౌడ్ లపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. లేని యెడల గౌడ్ అన్నల కోపాన్ని చవిచూడక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గౌడ్ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజు గౌడ్, గౌడ కల్లుగీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఐలి వెంకన్న గౌడ్, గౌడ ఐక్యసాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు అంబాల నారాయణ గౌడ్, అఖిల భారత గౌడ సంఘం గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి బందారం అనిల్ గౌడ్, బీసీ సమైక్య అధ్యక్షులు ఎస్ . దుర్గయ్య గౌడ్, జీబిఎన్ చీకటి ప్రభాకర్ గౌడ్, దామోదర్ గౌడ్, రాజు గౌడ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## మానసా దేవి అమ్మవారికి 108 రకాల ప్రసాదాలతో నైవేద్యం






**కరీంనగర్ (గన్నేరువరం)- నేటి ప్రభాత సూర్య:**
మండలంలోని ఖాసింపేట గ్రామంలో స్వయంభుగా వెలసిన శ్రీ మానసా దేవి ఆలయంలో శ్రావణమాసంలో చివరి శుక్రవారం కావడంతో 108 రకాల నైవేద్యాలతో అమ్మవారికి నివేదన. అనంతరం దశ కుష్మాండలతో అమ్మవారికి ప్రత్యేక హారతులు సమర్పించారు. అపురూప లక్ష్మి , మానసా దేవి అమ్మవారికి అలంకరణ చేసి పసుపు గౌరమ్మకు ప్రత్యేక పూజలు, నిర్వహించారు. అపురూపలక్ష్మి అమ్మవారికి క్షీరాభిషేకం, కుంకుమ పూజలు, అగ్ని దేవుని ప్రత్యేక పూజలు, నిర్వహించారు. భక్తులు 108 జంట నాగ శివలింగాలకు నీటితో అభిషేకం చేసి, అమ్మవార్లకు ఓడి బియ్యం, ముడుపులు కట్టారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు జరగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## పాక్‌తో ఆడితే తప్పేంటి..?

**అభిమానులపై సునీల్ గవాస్కర్ ఆగ్రహం**

ఆసియా కప్ 2025లో భారత్-పాకిస్థాన్ మధ్య జరిగే మ్యాచ్‌పై ఆటగాళ్లను విమర్శిస్తున్న వారిపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ తీవ్రంగా స్పందించారు. ఈ టోర్నమెంట్ సెప్టెంబర్ 9 నుంచి 28 వరకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో జరగనుంది. భారత్ తమ తొలి మ్యాచ్‌ను సెప్టెంబర్ 10న యూఏఈతో, ఆ తర్వాత సెప్టెంబర్ 14న పాకిస్థాన్‌తో ఆడనుంది. గవాస్కర్ మాట్లాడుతూ, "ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే, ఆటగాళ్లను ఎందుకు విమర్శించాలి లేదా వ్యాఖ్యలు చేయాలి? ఆటగాళ్లు బీసీసీఐతో ఒప్పందం కలిగి ఉన్నారు. భారత ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తారు. అన్నీ వారి చేతిలోనే ఉన్నాయి," అని అన్నారు. ఆటగాళ్లు ఈ విషయంలో నిస్సహాయంగా ఉన్నారని, వారు ఆసియా కప్ కోసం ఎంపికైనందున, ప్రభుత్వం ఆడమని చెబితే ఆడతారని, లేకపోతే బీసీసీఐ సూచనల మేరకు వ్యవహరిస్తారని ఆయన స్పష్టం చేశారు.





## ఆన్లైన్ గేమింగ్ బిల్లు ఐపీఎల్‌పై ప్రభావం చూపుతుందా?

లోక్‌సభలో 'ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు' ఆమోదం పొందింది. ఇది ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫారమ్‌లను పూర్తిగా క్లోజ్ చేయవచ్చు. ఈ ఆన్‌లైన్ గేమ్స్ భారతీయ క్రికెట్‌లో చాలా ప్రజాదరణ పొందింది. అయితే ప్రజలను ఆర్థికంగా దెబ్బతీస్తున్న గేమ్‌లు, బెట్టింగ్ యాప్‌లను పూర్తిగా నిషేధించనున్నారు. ఈ-స్పోర్ట్స్, సోషల్ గేమ్‌లకు అనుమతి లభించింది, కానీ బెట్టింగ్‌కు వ్యతిరేకంగా కఠిన చర్యలు తీసుకుంటారు. ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు లక్ష్యం డిజిటల్ గేమింగ్ రంగానికి చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌ను సిద్ధం చేయడం. ఆటగాళ్ల ఆర్థిక ప్రయోజనాలు కాపాడటం. క్రీడా ప్రపంచానికి చెందిన నిపుణులు దీని ఫలితాలపై సందేహం వ్యక్తం చేశారు. భారతదేశంలో క్రికెట్ చాలా ప్రసిద్ధి చెందిందని, భారత క్రికెట్, దాని సంస్థలకు స్పాన్సర్‌లకు లోటు ఉండదని నివేదికలు చెబుతున్నాయి. ఈ ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుకు కారణం వ్యక్తిగత ఫాంటసీ గేమింగ్ ప్లాట్‌ఫారమ్‌లను స్పాన్సర్ చేయడానికి అనుమతి లేకపోవడం పెద్ద దెబ్బగా చెబుతున్నారు. నివేదికలో, డబ్బును చెల్లించే ఏదైనా ఫాంటసీ గేమ్ అప్లికేషన్ ప్రకటనను మనం చూడగలమా? ఆటగాడికి ఇలాంటి ప్రకటన కోసం డబ్బు లభించినట్లయితే, డబ్బు చెల్లించి ఆడే గేమ్‌లను ప్రమోట్ చేస్తారా? అనేది అనుమానంగా ఉంది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ అధికారిక ఫాంటసీ స్పోర్ట్స్ భాగస్వామి 'డ్రీమ్11', ఇది ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫారమ్ 'మై 11 సర్కిల్'తో కొత్త ఒప్పందం కుదుర్చుకుంది. భారత క్రికెట్ జట్టు టైటిల్ స్పాన్సర్‌ను డ్రీమ్11 దాదాపు 44 మిలియన్ డాలర్లు (సుమారు 358 కోట్ల రూపాయలు)కి తీసుకుంది. అదే సమయంలో, ఐపీఎల్ ఫాంటసీ గేమింగ్ హక్కులను 'మై 11సర్కిల్'5 సంవత్సరాలకు 628 కోట్ల రూపాయలకు (సుమారు 125 కోట్ల రూపాయలు) కొనుగోలు చేసింది. దీనితో పాటు, భారతదేశంలోని టాప్ క్రికెటర్లు (మాజీ క్రికెటర్లు, ప్రస్తుతం ఆడుతున్న క్రికెటర్లు) కూడా గేమింగ్ ప్లాట్‌ఫారమ్‌లతో వ్యక్తిగత ఒప్పందాలు చేసుకున్నారు. ఆన్‌లైన్ మనీ గేమింగ్‌ను అందించడం లేదా వాటిని సులభతరం చేయడంపై 3 సంవత్సరాల జైలు లేదా 1 కోటి రూపాయల జరిమానా విధించవచ్చు. ఇందులో ఈ-స్పోర్ట్స్, సోషల్ గేమ్‌లపై నిషేధం లేదు. అయితే, ఇందులో ఎలాంటి డబ్బు లావాదేవీలు ఉండకూడదు. యువత భద్రత, మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని దీన్ని తీసుకువచ్చామని ప్రభుత్వం తెలిపింది.

## ఆసియా కప్‌లో భారత్, పాకిస్తాన్ మూడుసార్లు తలపడే అవకాశం



ఆసియా కప్ సెప్టెంబర్ 9న ప్రారంభం కానుంది. ఈ టోర్నమెంట్ ప్రారంభానికి కొన్ని రోజులే మిగిలి ఉన్నాయి. ఆసియా కప్ కోసం భారత్ కూడా టీమ్ ఇండియాను ప్రకటించింది. అయితే ఈసారి భారత్, పాకిస్తాన్ మధ్య అతిపెద్ద మ్యాచ్ చూడవచ్చు. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఇది మొదటి క్రికెట్ మ్యాచ్. ఆసియా కప్‌లో భారత్, పాకిస్తాన్ జట్లు మూడుసార్లు తలపడే అవకాశం ఉంది. ఆసియా కప్‌లో టీమ్ ఇండియా తన మొదటి మ్యాచ్ సెప్టెంబర్ 10న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ జట్టుతో ఆడనుంది. అదే సమయంలో పాకిస్తాన్ తన మొదటి మ్యాచ్ సెప్టెంబర్ 12న ఒమాన్‌తో ఆడనుంది. అయితే, సెప్టెంబర్ 14న జరిగే మ్యాచ్‌పై అందరి దృష్టి ఉంటుంది, ఎందుకంటే ఈ రోజున భారత్, పాకిస్తాన్ మధ్య మ్యాచ్ జరగనుంది. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత మొదటి క్రికెట్ మ్యాచ్ ఇది. ఈ మ్యాచ్ దుబాయ్ క్రికెట్ స్టేడియంలో జరుగుతుంది. భారత కాలమానం ప్రకారం, భారత్-పాక్ మధ్య ఈ మ్యాచ్ సాయంత్రం 7:30 గంటలకు ప్రారంభమవుతుంది. ఆసియా కప్‌లో జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. గ్రూప్ %ఏ%లో భారత్, పాకిస్తాన్, ఒమన్, యూఏఈ ఉన్నాయి. గ్రూప్ %బీ%లో ఆఫ్ఘనిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, హాంకాంగ్ చైనా ఉన్నాయి. ఈ రెండు గ్రూపుల నుంచి 2-2 జట్లు సూపర్ 4కి చేరుకుంటాయి. గ్రూప్ %ఏ% నుంచి భారత్, పాకిస్తాన్ అర్హత సాధిస్తే, సూపర్-4లో మరోసారి రెండు జట్ల మధ్య పోటీని చూడవచ్చు. భారత్, పాకిస్తాన్ మధ్య ఈ మ్యాచ్ దుబాయ్ లేదా అబుదాబిలో ఆడవచ్చు, ఇది భారత కాలమానం ప్రకారం సాయంత్రం 7:30 గంటలకు ప్రారంభమవుతుంది. సూపర్-4లో మెరుగైన ప్రదర్శన తర్వాత, ఫైనల్‌కు భారత్, పాకిస్తాన్ జట్లు అర్హత సాధిస్తే, ఆసియా కప్ 2025లోనే ఈ రెండు జట్ల మధ్య మూడోసారి పోటీని చూడవచ్చు. ఆసియా కప్ ఫైనల్ మ్యాచ్ సెప్టెంబర్ 28న దుబాయ్‌లో జరుగుతుంది. భారత కాలమానం ప్రకారం ఈ ఫైనల్ మ్యాచ్ కూడా సాయంత్రం 7:30 గంటలకు ప్రారంభమవుతుంది.

### బెంగళూరు మ్యాచ్‌లన్నీ బదలాయింపు




2025 మహిళల వన్డే వరల్డ్‌కప్ 2025 రీ షెడ్యూల్‌ను ఐసీసీ తాజాగా ప్రకటించింది. ఈ టోర్నీకి భారత్- శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్నాయి. సెప్టెంబర్ 30న ప్రారంభమైన టోర్నీ నవంబర్ 2న ముగుస్తుంది. అయితే ముందుగా ప్రకటించి షెడ్యూల్ ప్రకారం బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో 5 మ్యాచ్‌లు జరగాల్సి ఉంది. భద్రకా కారణాల వల్ల చిన్నస్వామి స్టేడియంలో జరగాల్సిన మ్యాచ్‌లను ఐసీసీ ఇప్పటికే రద్దు చేసింది. ఈ మ్యాచ్‌లనే ఐసీసీ రీ షెడ్యూల్ చేసి, శుక్రవారం ప్రకటించింది. భారత్ జట్టు బెంగళూరులో 5 మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఇందులో టోర్నమెంట్ ప్రారంభ మ్యాచ్, ఓ లీగ్ మ్యాచ్ ఉన్నాయి. అలాగే నాకౌట్ సెమీ ఫైనల్ మ్యాచ్‌లు ఉన్నాయి. అలాగే పాకిస్థాన్ జట్టు ఫైనల్‌కు చేరుకోకపోతే, ఫైనల్ మ్యాచ్ కూడా బెంగళూరులోనే జరగాల్సి ఉంది. తాజాగా ఈ మ్యాచ్‌లు అక్కడ నుంచి షిఫ్ట్ అయ్యాయి. బెంగళూరు మ్యాచ్?లను నవీ ముంబయిలోని డీవై పాటిల్ స్టేడియానికి షిఫ్ట్ చేస్తున్నట్లు ఐసీసీ తాజాగా ప్రకటన చేసింది. అయితే మ్యాచ్ తేదీలు, తలపడాల్సిన ప్రత్యర్థులు అన్ని అలాగే ఉంటాయి. వేదిక మాత్రమే మారుతుంది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరగాల్సిన టీమ్‌ఇండియా మ్యాచ్‌లు, నవీ ముంబయిలోని డివై పాటిల్ స్టేడియంలో జరుగుతాయి. ఒకవేళ పాకిస్థాన్ ఫైనల్‌కు చేరుకుంటే, ఆ మ్యాచ్ శ్రీలంకలో జరుగుతుంది. లేదంటే ఫైనల్ మ్యాచ్‌కు కూడా డివై పాటిల్ ఆతిథ్యం ఇస్తుంది.

## గోవాలో చిరు బర్త్‌డే వేడుకలు

**కేక్ కట్‌చేసి తినిపించిన చెర్రీ**

మెగాస్టార్ చిరంజీవి 70వ పుట్టినరోజు సందర్భంగా ఆయన తన కుటుంబంతో కలిసి గోవాలో వేడుకలు జరుపుకున్నారు. బర్త్‌డే వేడుకలు ఎంతో ఘనంగా, సంతోషంగా జరుగుతున్నాయి. అభిమానులు, సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు సోషల్ మీడియా వేదికగా చిరుకు శుభాకాంక్షలు తెలుపుతూ పోస్ట్‌లు చేస్తున్నారు. ఈ సందర్భంగా చిరు తనయుడు మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్ తన తండ్రికి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ ఓ ఎమోషనల్ వీడియోను షేర్ చేశాడు. వీడియోలో చరణ్ తండ్రికి కేక్ తినిపిస్తూ, చిరు పాదాలకు నమస్కరించి ఆశీర్వాదాలు తీసుకున్నాడు. ఆ తర్వాత ఇద్దరూ ప్రేమతో ఆలింగనం చేసుకున్నారు. చిరంజీవి కూడా చరణ్‌కు కేక్ తినిపిస్తూ కుమారుడిపై తనకున్న ప్రేమని తెలియజేశారు. అయితే రామ్ చరణ్ తన తండ్రికి శుభాకాంక్షలు తెలియజేస్తూ పెట్టిన పోస్ట్ అందరిని టచ్ చేసింది. 'ఇది కేవలం మీ పుట్టినరోజు మాత్రమే కాదు నాన్న... ఇది మీ లాంటి గొప్ప వ్యక్తికి జరుపుతున్న గొప్ప సంబరము! నా హీరో, నా గైడ్, నా ప్రేరణ మీరు. నా ప్రతి విజయం, నేను మోసే విలువలు అన్నీ మీ నుంచే వచ్చాయి. మీరు ఆనందంగా, ఆరోగ్యంగా మరెన్నో సంవత్సరాలు ఉండాలని ప్రార్థిస్తున్నాను అంటూ రామ్ చరణ్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.




నేటి ప్రభాత సూర్య
జాతీయ తెలుగు దిన పత్రిక
TGTEL/25/A0784



## మన శంకర వరప్రసాద్ టైటిల్ ఖరారు

**వెంకటేశ్ వాయిస్‌తో విడుదల**

మెగా157 - మెగాస్టార్ చిరంజీవి అభిమానులకు 2025 పుట్టినరోజు మరపురాని వేడుకగా మారబోతోంది. ఫ్యాన్స్ ఆశించినట్లుగానే క్రేజీ అప్‌డేట్స్ వరుసబెట్టి వచ్చేస్తున్నాయి. మెగా అభిమానులు మాత్రమే కాదు, సినీ ప్రేక్షకులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిరంజీవి - అనిల్ రావిపూడి సినిమా టైటిల్, గ్లింప్స్ ఎట్టకేలకి విడుదలైంది. చిరంజీవి - అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపొందుతోన్న సినిమా టైటిల్‌ను అధికారికంగా ఖరారు చేశారు. 'మన శంకర వరప్రసాద్ గారు అనే టైటిల్ కొద్ది రోజులుగా ఫిల్మ్ నగర్‌లో చక్కర్లు కొడుతుండగా, అదే టైటిల్‌ని అఫీషియల్‌గా ప్రకటించారు. ఈ టైటిల్‌ను విక్టరీ వెంకటేష్ వాయిస్‌ఓవర్‌తో అందించడం స్పెషల్ హైలైట్. చిరంజీవి, వెంకటేష్ మధ్య మంచి స్నేహబంధం ఉండటంతో, ఈ ప్రాజెక్ట్‌లో వెంకీ కీలక పాత్రలో కనిపించనున్నారు. గ్లింప్స్‌లో చిరంజీవి సూట్‌ధరించి సిగరెట్ తాగుకుంటూ అలా వస్తుండడం చూసి ఫ్యాన్స్ ఆనందం అంతా ఇంతా కాదు. చివరిలో గుర్రం పట్టుకొని నడుచుకుంటూ వచ్చే షాట్ కూడా అదిరిపోయింది. ఇక మన శంకర వర ప్రసాద్ గారు పండక్కి వస్తున్నారు అంటూ వెంకీ చెప్పడం మరో హైలైట్ అయింది. ఈ సినిమా 2026 సంక్రాంతికి థియేటర్లలోకి రాబోతోంది. గతంలో అనిల్ - వెంకటేష్ కాంబినేషన్‌లో వచ్చిన ఎఫ్2, ఎఫ్3 వంటి హిట్ కామెడీ ఎంటర్-టైనర్లు సంక్రాంతికి రిలీజై ఘన విజయం సాధించిన నేపథ్యం చూస్తే, ఈసారి కూడా అదే మ్యాజిక్ రిపీట్ కావొచ్చన్న అంచనాలు బలపడుతున్నాయి. చిరంజీవి నటిస్తున్న ఫ్యాంటసీ డ్రామా 'విశ్వంభర' నుంచి గ్లింప్స్ ఇప్పటికే రిలీజ్ కాగా, ఇది అలరించింది. ఈ చిత్రం 2026 వేసవిలో థియేటర్లలోకి వచ్చే అవకాశముంది.




## బాలయ్య ఎనర్జీకి ఫిదా అవ్వాల్సిందే


**అఖండ-2 విలన్ ఆది పినిశెట్టి**

నందమూరి బాలకృష్ణను చూసినవాళ్లెవరైనా ఆయన ఎనర్జీకి ఫిదా అయిపోవాల్సిందే. తాజాగా టాలెంటెడ్ యాక్టర్ ఆది పినిశెట్టి కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. బాలయ్యతో కలిసి నటించడం ఓ ప్రత్యేక అనుభవంగా మిగిలిందని చెబుతూ, బాలకృష్ణ గారు ఒక వ్యక్తి కాదు... ఓ శక్తి. ఆయన ఒరిజినల్ గా స్క్రీన్ మీద కనిపించేలా నిజ జీవితంలోనూ పవర్ హౌస్ లాంటి వ్యక్తిత్వం కలవారు అంటూ పొగడ్తల వర్షం కురిపించారు. తెలుగులో మోస్ట్ అవైటెడ్ మూవీగా వస్తున్న అఖండ 2 కోసం బాలయ్య-బోయపాటి శ్రీను మళ్లీ కలిశారు. ఈ సినిమాలో ఆది పినిశెట్టి విలన్ పాత్రలో కనిపించనున్నాడు



## సరదాగా సాగిన... పరదా మూవీ

చాలా రోజుల తర్వాత తెలుగు ప్రేక్షకుల ముందు కొచ్చిన మరోనాయికా ప్రధానమైన చిత్రం 'పరదా'. కమర్షియల్ సినిమాల్లో సగటు- హీరోయిన్‌గా, పక్కింటి అమ్మాయిగానే కనిపించిన అనుపమ పరమేశ్వరన్ ఇందులో ప్రధాన పాత్రధారి. యువ దర్శకుడు ప్రవీణ్ కండ్రేగుల ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. పడతి అనే ఓ కల్పితమైన ఊరు నేపథ్యంలో సాగే కథ ఇది. అక్కడ ప్రతి యువతీ పరదా కప్పుకొనే తిరగాలనేది ఆచారం. పరదా తీసినట్టు- రుజువైతే మాత్రం గ్రామ దేవత జ్వాలమ్మ ముందు ఆత్మార్పణ చేసుకోవాల్సి ఉంటుంది. అనాదిగా వస్తున్నఆ ఆచారాన్ని కొనసాగిస్తున్న ఊరి యువతి సుబ్బు (అనుపమ పరమేశ్వరన్) ఊహించని రీతిలో చిక్కుల్లో పడుతుంది. పరదా లేని ఆమె ఫొటో బయటకి రావడమే అందుకు కారణం. తాను ఆచారాన్ని తప్పలేదని వేడుకున్నా... ఆత్మార్పణ చేసుకోవాల్సిందే అని ఊరి ప్రజలు తీర్మానం చేస్తారు. ఒక పక్క తాను మనసిచ్చిన రాజేశ్ (రాగ్ మయూర్)తో నిశ్చితార్థానికి సిద్ధం అవుతుండగానే ఇదంతా జరుగుతుంది. ఆచారం ప్రకారం ప్రాణాలైనా వదలాలి, లేదంటే తప్పు చేయలేదనైనా నిరూపించుకోవాలని కోరతారు ఊరి ప్రజలు. దాంతో సుబ్బు తాను తప్పు చేయలేదని నిరూపించుకోవడం కోసం ధర్మశాలకి పయనం కావాల్సి వస్తుంది. ఆ ప్రయాణం ఎలా సాగింది? తనకి తోడుగా నిలిచిన రత్న (సంగీ), అమిష్ట (దర్శన రాజేంద్రన్) ఎవరు? ఇంతకీ పరదా లేని సుబ్బు ఫొటో ఎలా బయటికొచ్చింది? పడతి అనే ఊరు అనుసరిస్తున్న కఠినమైన ఆ కట్టుబాటు వెనక చరిత్ర ఏమిటి? సుబ్బు తాను తప్పు చేయలేదని నిరూపించుకుందా లేదా అన్నకథలో సాగిందీ సినిమా. అప్పుడప్పుడూ కొత్త కథలు అరుదుగా వస్తుంటాయి. చాలా రోజుల తర్వాత తెలుగు తెరపైకి వచ్చిన ఓ కొత్త కథ.. పరదా'. హీరో, హీరోయిన్, కమర్షియాలిటీ- తరహా లెక్కల్ని పట్టించుకోకుండా చేసిన ఓ సాహసోపేతమైన ప్రయత్నం. ముగ్గురు మహిళల స్నేహాల్ని, ఒకరి సమస్య కోసం ముగ్గురూ కలిసి చేసిన స్వేచ్ఛా విహారాన్ని అందంగా, ఆలోచన రేకెత్తించేలా ఆవిష్కరిస్తుంది. దైనందిన జీవితాల నుంచి బయటికొచ్చి చేసిన ఆ ప్రయాణం వాళ్లకు ఏం నేర్పింది? వాళ్లలో ఎలాంటి మార్పుని తీసుకొచ్చింది? సమాజం ముందు ఎలాంటి ప్రశ్నల్ని లేవనెత్తిందన్నది ఇందులో కీలకం. లింగ సమానత్వం అంశాన్ని ఓ కొత్త కోణంలో ఆవిష్కరించిదీ చిత్రం. సమానత్వం అంశం ఎప్పుడు ప్రస్తావనకి వచ్చినా అవతలి వాళ్లవైపు వేళ్లు వెళుతుంటాయి. కానీ, ఈ




సినిమా అందుకు భిన్నమైన విషయాల్నీ ప్రస్తావించింది. మనుషుల్లో మార్పుని, ఆ అవసరాన్ని సూచిస్తుంది. అయితే, చెబుతున్న కథ కొత్తదైనా... పాతదైనా తెరపై ఎంత ఆసక్తికరంగా సాగిందన్నదే కీలకం. సన్నివేశాలన్నీ ఒక విహారయాత్ర డాక్యుమెంటేషన్‌లా అనిపిస్తుంది తప్ప, కథ కథనాలు ఏమాత్రం ఆసక్తిని రేకెత్తించవు. ముగింపుతోపాటు పతాక సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. సుబ్బు పాత్రలో ఒదిగిపోయింది అనుపమ పరమేశ్వరన్. ప్రతి సినిమాలోనూ తన కళ్లతోనే భావాలు పలికించే ఆమె ఈ సినిమాలో ఎక్కువభాగం సన్నివేశాల్లో పరదా కప్పుకొనే కనిపిస్తూ ఉంటుంది.


Printed Published and owned by Polagoni Rajesh, Printed at Smilys Online, Ranga Reddy (Dist), Telangana 501510. at H.No 4-136/12, Journalist colony, Turkayamjal, Ranga Reddy District, Telangana-501510. Editor: Polagoni Rajesh, epaper. www.prabhatha suryaa.com. Email. Prabhatasurya838 @gmail.com. PRGI REG NO.TGTEL/25/A0784.